Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం, అక్టోబర్ 31, 2025 | సంపుటి - 20 | సంచిక 47 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది

- దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ
- 10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన




న్యూఢిల్లీ : అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు.

తరువాయి 2లో

# ఆపత్కాలంలో ఆదుకోండి

## అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు
- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీకి ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

- నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి
- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సిఎం పర్యటన

**వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించు కోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించు కునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు.**



హైదరాబాద్ : ఇది వరి కోతల కాలం..కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు.

తరువాయి 2లో



## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు



హైదరాబాద్ : తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకా రానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. 2లో

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

- 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ విడుదల



2

# అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జూదన్న భట్టి
- బిజెపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్



మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు.

హైదరాబాద్ : అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్ లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్ లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. 2లో



2

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పంట నష్టపోయిన ప్రాంతాల్లో మంత్రి పొన్నం పర్యటన

సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కోహెడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించారు. పోరెడ్డిపల్లి గ్రామంలో భారీ వర్షం కారణంగా జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు.



2

## ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి

హైదరాబాద్ : ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయండి



- 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని గోదాములకు తరలించాలి
- అవసరమైతే ఫంక్షన్ హాళ్లలో ధాన్యం నిల్వ చేయండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని 2లో

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బిజెపి, బిఆర్ఎస్‌ల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం



హైదరాబాద్ : నవంబర్ 11వ తేదీన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల బరిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అయితే ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి.. తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ఈ స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. అందుకోసం ఈ అసెంబ్లీ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా

తరువాయి 2లో

# మొంథా తుఫాన్‌తో రోడ్లకు దెబ్బ




- 334 లోకేషన్స్‌లో 230 కి.మీ ధ్వంసం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్ : మొంథా తుఫాను ప్రభావంతో తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. తాజాగా తుఫాన్ ఎఫెక్ట్స్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి మాట్లాడారు. నిన్న అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని 2లో

# తుపాను నష్టం రూ.5,265 కోట్లు

## వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు

- ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం
- ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం
- సకాలంలో విద్యుత్ పునరుద్ధరించాం
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు



అమరావతి : 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియో ట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు

తరువాయి 2లో

# ఆపత్కాలంలో ఆదుకోండి

తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేలు వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించు కోవాలని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత జిల్లా ఇంఛార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷–లో, అవుట్ ఎ÷–లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది

జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరు సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సిఉంది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్ట్‌లోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


వరదలతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని.. పూర్తిగా జలమయం అయిందని తెలిపారు. రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. వేలాది ఎకరాల్లో ధాన్యం దెబ్బతిన్నదని.. కొట్టుకుపోయిందని అన్నారు. వర్షాలకు రోడ్లు మొత్తం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇప్పుడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని.. హుస్నాబాద్‌లో పర్యటించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశామన్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఆదుకోవాలని.. ఇక్కడ పర్యటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకొని బాధ్యతగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు ప్రజల మధ్యే ఉండి నష్టపోయిన పంటలను అంచనా వేయాలని, భారీ వరదలకు జరిగిన నష్టాన్ని మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు

## తుపాను నష్టం రూ.5,265 కోట్లు

తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు.అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

## సూప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ,అక్టోబర్30 : సూప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.



## తడిసిన ధాన్యం కొనుగోలు చేయండి


ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్ఛార్జ్ అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్ఛార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవిన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

## అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు

ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దినను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్య కారణంగా ఆయన జూన్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. అలాగే బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి గెలిచి మూడో స్థానంలో ఆయన నిలిచిన విషయం విదితమే. మరో వైపు ఈ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపుపై మైనార్టీల ఓట్లు అధిక



ప్రభావం చూపిస్తుంది. కానీ రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ముస్లిం మంత్రి ఒక్కరు కూడా లేరు. దీనిని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి వేళ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 ఏడాది చివరిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజారుద్దీన్ బరిలో నిలిచి.. రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో అజారుద్దీన్‌తోపాటు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కొదండరామ్‌ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన దస్త్రాన్ని గవర్నర్‌కు పంపింది. కానీ దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో అజారుద్దీన్‌కు తొలుత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. దీనికి బీఆర్ఎస్, బీజేపీలో మోకాలడ్డుతు న్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నవంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలువడనున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ఎత్తులు వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సరెండర్ అయిందని.. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు బీజేపీ సరెండర్ అయిందని ఆరోపించారు. ఆ క్రమంలోనే బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే అజారుద్దీన్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం జరగకుండా ఉండేందుకు గవర్నర్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెలుపల ఎన్నికల కోడ్ లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని కరగ్‌పూర్ నియోజకవర్గంలో పోలింగ్‌కు ముందు అభ్యర్థిని మంత్రిగా బీజేపీ ప్రకటించిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అజారుద్దీన్.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అభ్యర్థి కూడా కాదు. అయినా అభ్యంతరం ఎందుకు అంటూ సందేహం వ్యక్తం చేశారు.అ అయితే తమ ప్రభుత్వానికి స్పష్టత, సంకల్పం ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

### 9 నెలల పాటు ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ : ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నా మన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బంద్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీనగర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ రాణిగంజ్, పంజాగుట్ట, రసూల్‌పురా, ప్లాజా వైపు నుంచి సీటీఓ జంక్షన్ ద్వారా తాడ్‌బంద్ వైపు వెళ్లేవారు రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ నుంచి అన్నానగర్, బాలంరాయ్, తాడ్‌బంద్ ద్వారా పంజాగుట్ట, ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు మీటింగ్ పాయింట్ బైలేన్, హాకీ గ్రౌండ్ బైలేన్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ మార్గాలను ఉపయోగించాలని జాయింట్ సీపీ సూచించారు. ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ఎ÷–లాట్‌ఫారంలను చూడవచ్చని, ప్రయాణ సమయంలో అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కి కాల్ చేయవచ్చన్నారు.

## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

## మొంథా తుఫాన్‌తో రోడ్లకు దెబ్బ

అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. వరి ధాన్యం సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులు ఐకేపీ సెంటర్లో ఉంది. మన ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం.. తడిసిన ధాన్యాన్ని కూడా కొని వెంటనే మిల్లులకు తరలించేలా ముఖ్యమంత్రి, సివిల్ సప్లై మినిస్టర్ చొరవ చూపాలి. సేకరించిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా.. మిల్లర్లు వెంటనే ఆ ధాన్యాన్ని తీసుకునేలా చూడండి.. పత్తి తేమ శాతానికి సంబంధించి ఇప్పటికే సీసీఐ ఛైర్మన్ లలిత్ కుమార్ గుప్తాను ముంబై వెళ్లి మరి కలిసి రైతుల పక్షాన ప్రత్యేక విజ్ఞప్తి చేశాను.. తేమ శాతంలో సడలింపులు ఇచ్చి తెలంగాణ పత్తి రైతులను ఆదుకోవాలని కోరాను. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి కి రిక్వెస్ట్ చేస్తున్నాం.' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷–దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

## కరూర్ ఘటన తరవాత మళ్లీ ప్రజల్లోకి విజయ్

### పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్న నేత

చెన్నై,అక్టోబర్30 : కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు.

# రామగుండం వైద్య కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ

**- ఎలాంటి విపత్కర పరిస్థితిలోనైనా ధైర్యంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**






గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : వైద్యవృత్తిని ఎంచుకున్న విద్యార్థులు ఎటువంటి విపత్కర పరిస్థితిలోనైనా ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం రామగుండంలోని సింగరేణి వైద్య కళాశాలలో నిర్వహించిన వైట్ కోట్ సేర్మనీలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జ్యోతి ప్రజ్వలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వైద్య కోర్సును ఎంపిక చేసుకుని మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలో రామగుండం సింగరేణి వైద్య కళాశాల వద్ద మెరుగైన వసతులు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సింగరేణి వైద్య కళాశాలలో కమిట్మెంట్ తో పని చేసే ఫ్యాకల్టీ అందుబాటులో ఉందని ఇక్కడ విద్యార్థులకు మంచి టీచింగ్ అందుతుందని అన్నారు. వైద్యులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా నిర్దేశించుకున్న లక్ష్యాలను వైట్ కోట్ సేర్మనీ గుర్తు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. గత 2.5 సంవత్సరాలుగా మీరు చేసిన కృషి ఫలితంగా ఈ రోజు వైట్ కోట్ సర్మనీ లో పాల్గొంటున్నారని, ఇక్కడ విద్యార్థులు వివిధ ప్రాంతాలు, సామాజిక ఆర్థిక పరిస్థితుల నుంచి వచ్చిన వారు ఉన్నారని, ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన కృషి ఉందని అన్నారు. సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ గత 4 సంవత్సరాలుగా ఉన్నతమైన సేవలు అందిస్తుందని, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్య కళాశాల గా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే 4,5 సంవత్సరాలు మీ జీవితంలో చాలా కీలకం కాబోతుందని, అనేక సార్లు నిరుత్సాహపడే పరిస్థితులు రావచ్చని, ఒత్తిడి పెరగవచ్చని, ఎటువంటి పరిస్థితుల్లోనూ నమ్మకం ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని, గత రెండున్నర సంవత్సరాలుగా చూపించిన ధైర్యం భవిష్యత్తులోనూ కొనసాగించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. నరేందర్, డా. లావణ్య, డా. ప్రదీప్ చంద్ర,డా. భాను లక్ష్మీ,డా. ఫరీద్,డా. అనూష,డా. రాజు,డా. శిరీష , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రం సంజీవ్



ధర్మారం, అక్టోబర్ 30 (ది క్రైమ్ న్యూస్) ఆల్ ఇండియా బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రం సంజీవ్ ను ఏకగ్రీవంగా నియామకం చేయటం జరిగింది, నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు కొత్త విజయ భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రం సంజీవ్ మాట్లాడుతూ నమ్మకంతో నా మీద రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కొత్త విజయ భాస్కర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆల్ ఇండియా బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ అభివృద్ధి కి, హక్కుల సాధన కోసం, మంచి సమాజ నిర్మాణానికి, అన్యాయాల పై పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డోంగ్లి శ్రీనివాస్, బెల్లంకొండ జ్యోతి గౌడ్, కొత్వాల్ సంతోష, షేక్ ఎజాజ్ పాషా, మంద ఆనంద్ మురళి, కాకుమాను మెర్సీ జ్యోతి, గంజి శశి కుమారి, పోలంకి జగదీష్ కుమార్, బాణాల ప్రేమలత, పోలంకి ఉషారాణి, మంద లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : రామగుండం నియోజకవర్గం పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం రామగుండం మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నగర కార్పొరేషన్ పరిధిలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి క్రింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ఇతర పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి పర్యవేక్షిస్తూ చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్ ,ఈఈ మున్సిపల్ రామన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారినా పోలంపల్లి స్థితిగతులు మారడంలేదు: బోయిని తిరుపతి



తిమ్మాపూర్, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతికి పోలంపెల్లి - మొగిలిపాలెం దారిలోని బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయి ఇసుక ట్రాక్టర్ మధ్యలోనే దిగబడిపోయింది. గ్రామ పరిస్థితిపై సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ....గత కొన్నేండ్ల నుండి ప్రతీ సంవత్సరం కురిసే వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోతుండగా ప్రతిసారీ మట్టి పోసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. సిపిఐ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వాలు మారిన బ్రిడ్జి నిర్మాణం జరగక మానకొండూర్ నుండి హుస్నాబాద్ వెళ్ళేందుకు వీలుగా ఉన్న దారిలో నాణ్యతలేని లో లేవల్ బ్రిడ్జితో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సంభందిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని బోయిని తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో గొట్టిపర్తి సమ్మయ్య, ఉప్పారపు సంపత్, రెడ్డి సంపత్, పడాల సది, దోబ్బల రాజమల్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ కార్యాచరణ అమలు**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ, డి.సి.పి కరుణాకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి.వనజ లతో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సుల్తానాబాద్, పెద్దపల్లి, బసంత్ నగర్, ఎన్.టి.పిసి, గోదావరిఖని 1 టౌన్ లో అధికంగా ప్రమాదాలు జరిగే 28 హాట్ స్పాట్ లను గుర్తించి 27 లక్షలతో ఎల్.ఈ.డి. హై మాస్ లైట్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బసంత్ నగర్ లో మరో 2 చోట్ల 5 లక్షల రూపాయలతో హై మాస్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పట్టణంలో 15 లక్షల ఖర్చుతో నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని అన్నారు. రోడ్డు పై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవసరమైన మేర స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు పై పశువులు విడిచిపెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ 10 వేల రూపాయల జరిమానా విధించాలని, పశువులను గోశాలలకు తరలించాలని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్.కే.ఆర్ సిబ్బంది మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పెద్దపల్లి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన మేర రొడ్డు విస్తరణ కు చర్యలు తీసుకోవాలని అన్నారు.రొడ్డు విస్తరణ సజావుగా జరిగేలా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని సంబంధిత వీధి వ్యాపారులను ఒప్పించాలని అన్నారు. డివైడర్ లను పరిశీలించి అక్కడ ప్రమాదాల జర్గకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం నగరంలో అవసరమైన చోట సిసి కేమేరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం జరిగిన ప్రమాదాలపై రిపోర్ట్ అందించాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో రోడ్డు స్ట్రిప్స్ , రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. టౌన్ లో ట్రాఫిక్ నియంత్రణ కోసం యూ టర్న్ ల పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత ప్రమాణాల పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో అధికంగా ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఉండాలని అన్నారు. హిట్ అండ్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదనలు త్వరగా పంపాలని కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాలోని రహదారి పక్కన ఉన్న పిచ్చి మొక్కల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లారీలు, ట్రాక్టర్ లు, భారీ వాహనాలు, కార్లకు ముందు వెనుక తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్ ,కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి , సిఐ, ఎస్ఐ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎఫ్‌సిఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి

**- ఆందోళనలను విరమింప చేయుటకు యాజమాన్యం చొరవ చూపాలి.**

**- కార్మిక సంఘాలతో కార్మికుల సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**



గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : గత రెండు రోజులుగా ఆర్ ఎఫ్ సి ఎల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తనట్లు గా వ్యవహరించడం సరైనది కాదని సిఐటియు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి అన్నారు. చట్టబద్ధంగా వారికి రావాల్సిన హక్కులన్నింటిని కల్పించాల్సిన బాధ్యత ఆర్ ఎఫ్ సీ ఎల్ యాజమాన్యానికి ఉన్నదని గుర్తు చేశారు. యాజమాన్యం తన బాధ్యతను విస్మరించడం వల్లనే ఈరోజు ఆర్ఎఫ్సిఎల్ లో ఆందోళనలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ఆందోళనలకు పూర్తి బాధ్యత ఆర్ ఎఫ్ సి ఎల్ యాజమాన్యం బాధ్యత వహించాలని అన్నారు. అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా ఎఫ్ సి ఐ సంస్థ ఆర్ ఎఫ్ సి ఎల్ గా మారిందని, ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఈ పరిశ్రమలో మొదటి నుండి ఇప్పటివరకు అనేక ఆందోళన కార్యక్రమాలకు ఆర్ఎస్సిఎల్ అడ్రస్ గా నిలిచిందని అన్నారు. ఈ ఆందోళనలు ఇలాగే కొనసాగితే పరిశ్రమ పరిస్థితి ఏంటి అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, చట్టబద్ధంగా రావలసినటువంటి హక్కులను కావాలని కోరుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వారికి రావలసినటువంటి చట్టబద్ధహక్కులను కల్పించి వారి సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాల్నారు

## గట్టుదుద్దెనపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



మానకొండూర్, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లిలోని అంబేద్కర్ సంఘ భవనంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించే విదంగా గ్రామస్తులంతా సోదరభావంతో మెలగాలని అధికారులు సూచించారు.ఆర్ఐ ప్రీతి,సివిల్ అధికారి కుసుమాకర్ రావు, కార్యదర్శి ఆనంద్,విఆర్ఓ తిరుపతి, ఏఎస్ఐ జమాలుద్దిన్, మాజీ సర్పంచ్ మంద అంజయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం కుమార్,మంద నాగయ్య ,జన్నవరం రమేష్,కనకం సమ్మయ్య,మంద అమర్,కండె రమేష్,కనకం గౌతమ్ అంబేద్కర్ సంఘ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, డెమోక్రటిక్ సంఘ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో టిఎల్ఎం మెగా మేళ



గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : గోదావరిఖని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో టి ఎల్ ఎం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్ట్ వర్కులు టీచర్స్, పేరెంట్స్ కు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణ పాఠశాలల ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తిని వెలికి తీసేందుకు టిఎల్ఎం ఎంతగానో ఉపయోగపడుతుందని, అంతేకాకుండా విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చైతన్య రావు తో పాటుగా, కోఆర్డినేటర్ శ్వేత, ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, ఏవో శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు జరిగిన నష్టంపై ప్రభుత్వం భాద్యత వహించాలి

**సుగుర్తి జగదీశ్వర చారి**



తిమ్మాపూర్, అక్టోబర్30(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో మొంథా తుపాన్ దాటికి జరిగిన నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం భాద్యత వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరా చారి గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.తుపాన్ హెచ్చరికలున్నప్పటికి అధికారుల నిర్లక్ష్యం వల్లే కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వర్షార్పితమైందని ఆరోపిస్తూ అధికారులపై చర్యలు తీసుకుని నష్టపోయిన రైతులకు బేషరతుగా డబ్బులు చెల్లించాలన్నారు. తూకం వేయకపోవడంతో తడిసిన ధాన్యాన్ని కోర్రీలు లేకుండా కొనుగోలు చేసి, నీట మునిగిన ధాన్యానికి సంభందించి ప్రాథమిక అంచనా కాకుండా రైతువారిగా వివరాలు సేకరించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ ఇతర పంటలతో పాటు కూరగాయలు పంటలతో నష్టపోయిన రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పశునష్టం, ఆస్తి నష్టంపై కూడా సమగ్ర విచారణ జరిపి భాధితులకు పరిహారం అందేలా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పూర్తి చొరవ తీసుకోవాలని కోరారు.తుపాన్ దాటికి నష్టపోయిన భాదితులకు అండగా నిలిచి శుక్రవారం స్థానిక తహసీల్దార్ ను భాదితులతో కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు జగదీశ్వర చారి ప్రకటన ద్వారా తెలిపారు.

## అన్నదాతలను ఆదుకోవాలి

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అకాల వర్షం కారణంగా పెద్దపల్లి జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లిందని, వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లేపల్లి అశోక్ డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులు ఎవరు కూడా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం హామీ ఇవ్వాలని సిపిఎం పార్టీగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అకాల వర్షాల కారణంగా అనేకమంది రైతులు నష్టపోయారని, వేలది ఎకరాలలో పంట పొలాలు దెబ్బతిన్న పరిస్థితి ఉందని, ఐకెపి సెంటర్లలో కూడా వరి ధాన్యం తడిసి ముద్దయిన పరిస్థితి ఉందని కావున రాష్ట్ర ప్రభుత్వం కోతలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

# సంపాదకీయం

## సహాయ,పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి !

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజోన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉద్ధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్దరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్తాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

# సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!



డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు, మూలధన వ్యయం అవసరాలు 30 శాతానికి పైగా పెరిగినట్టు 40 శాతం మంది ఎగుమతిదారులు నివేదించారు. ఇది వస్త్ర రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని నొక్కిచెప్తున్నది. భారతీయ వస్త్రాలపై అమెరికా సుంకాల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు ఆర్డర్ల రద్దుతోపాటు పోటీతత్వాన్ని తట్టుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి తక్కువ సుంకం ఉన్న దేశాలతో పోటీపడుతున్నందున పెద్ద, చిన్న పరిశ్రమలు కూడా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. అంతా స్థిరపడిన తరుణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు తమ వ్యాపారాలను నాశనం చేసిందని సూరత్‌కు చెందిన జేపీ కాచివాలా కంపెనీ డైరెక్టర్ ధర్మేష్ కాచివాలా ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డాం. యూఎస్ వినియోగదారులు కోరినట్టుగా అధిక నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేస్తాం. కాబట్టి, మా పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. సుంకాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లపై దృష్టిసారించాలని ఇప్పుడు సలహా ఇస్తున్నారు. కానీ, పోటీ తీవ్రంగా ఉంది. అంతేకాదు, దేశీయ మార్కెట్ లాభదాయకం కాదు' అని ఆయన చెప్పారు. దేశంలోని వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఒక్క సూరత్‌లోనే ఉత్పత్తిలో 30-40 శాతం క్షీణత, రూ.7,200 కోట్లకు పైగా ఆదాయం కోల్పోయినట్టు అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారాలు పనిదినాలను తగ్గించుకుంటున్నాయి. డిమాండ్ పడిపోవడంతో వస్త్ర పరిశ్రమలు ప్రమాదంలో పడ్డాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ, ఇది మూణ్నాలుగు నెలల్లో తగ్గిపోతుందని కాచివాలా అంచనా వేశారు. 'మేం ఇతర ఎగుమతి మార్కెట్లను అన్వేషిస్తున్నాం. కానీ, కొత్త మార్కెట్లలో పాగా వేసేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. అమెరికాతో పోలిస్తే యూరోపియన్ మార్కెట్ల పరిమాణం చాలా తక్కువ. గత మూడు నెలలుగా మా పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు' అని ఆయన చెప్పారు. సుంకాల ప్రభావాన్ని అధిగమించడానికి ఎగుమతిదారులు గల్ఫ్, ఆగ్నేయాసియాలోనూ భారీ డిస్కౌంట్లను అందిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తి స్థావరాలను అన్వేషిస్తున్నారు. యూకేతో భారత్ చేసుకుంటున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలతో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే, అమెరికా సుంకాల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రస్తుత రుణాల చెల్లింపుపై తాత్కాలికంగా వెసులుబాటు ఇవ్వాలని, మూలధన వ్యయం కోసం పూచీకత్తు లేని రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని వస్త్ర పరిశ్రమలు కోరుతున్నాయి. ముడి పదార్థాల దిగుమతులపై ఉన్న ఆంక్షలు, దిగుమతి సుంకాలను తొలగించాలని అభ్యర్థిస్తున్నాయి. అంతేకాదు, సిబిల్ స్కోర్‌ను ప్రభావితం చేయకుండా రుణాలపై వడ్డీ మినహాయింపులను ఆశిస్తున్నాయి. ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీని ప్రకటిస్తే తాత్కాలికంగా ఊపిరి పీల్చుకుంటామని, కార్మికుల ఉపాధిని కాపాడుకోగలమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కందుల పర్యటన

### నష్టం వివరాలు తెలుసుకున్న మంత్రి

భీమవరం : రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పలుమార్లు పర్యటనలు చేసి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరపునుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సైతం అధికారులతో సమన్వయం చేసుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవాలని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశర చేశారు. ప్రాథమిక అంచనాలో సుమారు 98 హెక్టార్ల అరటి తోటలు, 1800 హెక్టార్ల వరి పంట నేలకొరిగినట్లుఉద్యాన అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఉండ్రాజవరం, దమ్మెన్ను, పసలపూడి, కే సావరం, మోర్త, కాల్దారి తదితర గ్రామాలలో నివాసయోగ్యం కాని గృహాలలో నివసిస్తున్న 50 కుటుంబాలు, 170 మందికి, పునరావాసం కల్పించామన్నారు. వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్యవాడ, తదితర గ్రామాలలో మూడు రోజులపాటు మాంసం విక్రయాలు నిలిపి వేయాలని గ్రామంలో అవగాహన కల్పించినట్లు కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. తుఫాను ప్రభావాన్ని తట్టుకొని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా, మండల విద్యుత్ శాఖ, కరెంటు తీగలపై చెట్టుకొమ్మలు పడకుండా నరికివేత, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎలక్ట్రికల్ అధికారులు చెప్పారు. అప్పటివరకు వస్తూ, పోతూ ఉన్న విద్యుత్ సరఫరా భారీ గాలులతో సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు నెట్ సంబంధం తెగిపోయింది, ఇన్వెర్టర్లు మూగబోయాయి, అంధకారంలో, దోమల తో ప్రజలు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఏది ఏమైనా మండలంలో తుఫాను ప్రభావం విద్యుత్ సరఫరా పై అధికంగా పడిందని చెప్పుకోవాలి.

## మొంథా తుఫాన్‌తో భారీగా నష్టం

### చెరువులుగా మారిన ఊరూవాడలు

### భారీగా పంట నష్టం వాటిల్లినట్లు అంచనా

సిద్దిపేట,అక్టోబర్30 : మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల - హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


## ప్రముఖ నటుడి నివాసానికి బాంబు బెదిరింపులు..

### చెన్నైలో మరోసారి కలకలం

తమిళనాడు రాజధాని చెన్నైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. పలువురు ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాలకు గత కొన్నిరోజులుగా వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా యూఎస్ కాన్సులేట్ తోపాటూ ప్రముఖ నటుడు ప్రభు నివాసానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. డీజీపీ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు రెండు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో దాన్ని నకిలీ బెదిరింపుగా తేల్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిర్గుణోపాసనే ఉత్తమం

ఓ కృష్ణా! నీ సగుణ రూపాన్ని నిరంతరం అనన్య భక్తితో విధివిధానంగా ఆరాధిస్తూ ధ్యానించేవారున్నారు. అలాగే కేవలం అక్షరుడవని.. సచ్చిదానంద నిరాకార పరబ్రహ్మంగా భావించి ఉపాసించే వారూ ఉన్నారు. ఈ రెండు మార్గాలలో ఉపాసించే వారిలో అత్యుత్తమ యోగులు ఎవరు? అంటూ ప్రశ్నిస్తున్నాడు, అర్జునుడు. భగవంతుడు ఒక్కడే.. అతణ్నే సాకారంగానూ, నిరాకారం గానూ ఆరాధిస్తారు. కాబట్టి సగుణ నిర్గుణ రూపాలలో చిత్తశుద్ధితో ధ్యానించినా, ఆరాధించినా ఫలితం లభిస్తుంది, లక్ష్యం చేరుకోగలం. భగవత్ ఆరాధన అంటే.. బాధ్యతలను పక్కనపెట్టి గుడులు గోపురాలు తిరగడమో, తీర్థయాత్రలు చేయడమో, గంటల కొద్దీ పూజా గృహంలో గడపడమో కాదు. అట్టహాసంగా, ఆర్భాటంగా పూజాదికాలు నిర్వహించడం అంతకన్నా కాదు. చేసే ప్రతి పనీ భగవదారాధనగా భావిస్తూ.. కర్తవ్యాన్ని పాలించడమే.. నిజమైన ఆరాధన. 'రామోరాజ్య ముపాసిత్వా' అన్నారు. అంటే రాముడు రాజ్యాన్ని పాలించలేదు.. ఉపాసించాడట. హక్కుగా భావించడం పాలించడం.. బాధ్యతగా భావించడం ఉపాసించడం. ప్రతిజీవిలోనూ అంతర్లీనంగా భౌతిక ఆకృతికి అతీతమైన దైవత్వాన్ని గుర్తించడం. దానిపట్ల గౌరవ భావనతో వ్యవహరించడమే ఉపాసన. భగవంతుడిని భజించే సమూహానికి అవసరమైన వసతులు, వనరులు సమకూ రుస్తూ.. బయట తిరుగుతూ ఉన్నా మనసును మాత్రం భజనపై, భగవంతునిపై కేంద్రీక రించడామూ ఉపాసనే.మనసులో పరమాత్మను నిలుపుకోవడం, దైవ చింత నాపరులై ఉండటం, శ్రద్ధతో ఆరాధించడం.. ఈ మూడు ఆచరిం చడమే ముఖ్యం! కాని అది సగుణోపాసనా, నిర్గుణోపాసనా అనేది విచారణీయాంశం కాదు. భౌతిక జీవితానికి సంబంధించిన కర్తవ్యాలను నిర్వహించే క్రమంలో భక్తి, శ్రద్ధలు, ఆ క్రమంలో న్యాయంగా ప్రవర్తించడం, త్యాగభావనతో వర్తించడం, సంపదను సృష్టించడం, పెంచుకోవడం, ఇతరుల కష్టాలపట్ల సహానుభూతిని ప్రకటించడం.



ఆధ్యాత్మికం

# కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

## ఆవేదనతో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలి

### - మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అకాల వర్షాల వలన తడిసిన, మొలకలు వచ్చి, రంగు మారిన ధాన్యాన్ని ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అన్నదాతలు అమ్మకానికి ధాన్యాన్ని తీసుకొచ్చి గత పది రోజులైనా కానీ కొనుగోలు సరిగా జరగకపోవడం వలన, అకాల వర్షాల కారణంగా, వారికి సరిగా సదుపాయాలు చేయకపోవడం వలన ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చి, అన్నదాతలు అవస్థలు పడుతూ తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. రైతుల అవస్థలు, రైతుల పరిస్థితి చూస్తే హృదయ విదారకంగా ఉందనీ, పండించిన పంట కొనుగోలు కొరకు తీసుకొచ్చి, గత 10 రోజుల నుంచి కొనుగోలులు జరగక, కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో ఈ అకాల వర్షాలు రావడం వలన పూర్తిగా ధాన్యం తడిసిపోయి, ధాన్యం నిండా మునిగిపోయి, చాలా ధాన్యం మొలకలు వచ్చేటువంటి స్థితిలో ఉందన్నారు. కొంత ధాన్యం మొలకలు కూడా వచ్చిందన్నారు. ఇటువంటి ధాన్యాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రంగు మారిపోయినా కానీ, తడిసినటు వంటి ధాన్యాన్ని ఎటువంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు గత యాసంగిలో గాని, ఇప్పుడు వానకాలంలోనీ సన్న వడ్ల పంటకు 500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మితిమీరిన ఈ అకాల వర్షాలతోని రైతులు సేద్యం చేస్తున్న పత్తి కావచ్చు, వరి పంట కావచ్చు, కూరగాయల పంటలు కావచ్చు, ఏ పంట అయినా పూర్తిగా రంగు మారి పోయినా, చెడిపోయినా ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా పత్తి చేన్లు అయితే ఆకు జాడిచ్చి, ఎర్రబడిపోయి ఎకరాకు రెండు క్వింటాలు కూడా దిగుబడి రాని పరిస్థితిలో ఉన్నాయని, పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితిలో చాలా మంది రైతులు తీవ్ర దుఃఖంతో కనబడుతున్నారని, ఇవన్నీ పరిగణలోకి తీసుకుని కనీసం చేతికి వచ్చిన పంటనైనా వెంటవెంటనే కొనుగోలు చేయాలని, కొంత తేమ శాతం ఎక్కువ ఉన్నప్పటికీ కూడా పత్తి కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. తప్పకుండా ఈ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి తను కూడా రైతు బిడ్డ, రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి గనుక ఈ రైతులను వెంటనే ఆదుకొని, బకాయి ఉన్న బోనస్ వెంటనే చెల్లిస్తూ, తడిసిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, పత్తి పంట విషయంలో తేమ అంటూ రైతులను ఇబ్బంది పెట్టవద్దని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లు జూపల్లి సందీప్ రావు, మహిపాల్ రెడ్డి, మాజి ఎంపీపీ పాల రామారావు,బోయిని రాజమల్లు, సూర శ్యామ్, తిప్పరపు దయాకర్, క్యాదసి. చంద్రమౌళి, తాళ్లపెల్లి. మనోజ్ గౌడ్, గొడుగుల సతీష్, శీలం శంకర్,కొయ్యడ. అరుణ్, శ్రవణ్, రాజు, సంపత్, పసెడ్ల సంపత్,కర్రే కుమార్, గరిగంటి. కుమార్, సర్వర్,గొట్టం మహేష్,కాంపెల్లి రాజు,సరేష్,అసంపెల్లి శంకర్ నాయకులు పాల్గొన్నారు.

# వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### - బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు



జమ్మికుంట అక్టోబర్ 30 (ది క్రైమ్ న్యూస్) : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో పంటలు నీట మునిగి అనేకమంది రైతులు తీవ్రంగా పోయారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు కోరారు. వరి,పత్తి,మొక్కజొన్న పంటలకు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో ఇలాంటి వర్షాలు పడడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం సెంటర్లను ఓపెన్ చేసి చేతులు దులుపుకుందని సంపత్ రావు దుయ్యబట్టాడు. రైతులకు కావలసిన కనీస సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు సమయంలో వర్షాలు పడి ధ్యానం మొత్తం తడిసి రైతులు త్రీవ్రంగ నష్టపోయారని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి కొనుగోలు సెంటర్లకు వరి ధాన్యం తెచ్చిన రైతులకు సరిపడా టార్పాలిన్ లు ఇవ్వవలసి వుండేదని, కానీ ఆ రకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ముఖ్యమంత్రికి జూబ్లీహిల్స్ ఎన్నికలపైన ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేకపోవడం బాధాకరమని చురకంటించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని రైతులు నష్టపోయి తీవ్ర ఆందోళన చెందుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారిస్తున్నదని, రైతు ప్రభుత్వం అంటే ఇదేనా అని సంపత్ రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే పంట నష్టం పై వ్యవసాయ అధికారులతో సర్వే చేపించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. లేనట్లయితే రైతాంగానికి అండగా బిజెపి ఉద్యమిస్తుందని సంపత్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అనుభవం, నైపుణ్యం, అర్హతల ఆధారంగా శిక్షకులను ఎంపిక

### పరిసర ప్రాంతాల మహిళలు 31 మంది హాజరు

రామగిరి, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్):- రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్వహించనున్న వివిధ వృత్తి శిక్షణ కోర్సుల శిక్షకుల ఎంపిక కోసం గురువారము స్థానిక సేవా భవన్ నందు ఎస్వోటుజిఎం ఎం.రామ్మోహన్, ఇతర కమిటీ సభ్యులు ఐ ఈ డీ.జీ.ఎం. మురళికృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ పి.రాజేశం ముఖాముఖిలు (ఇంటర్వ్యూలు) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వోటుజిఎం మాట్లాడుతూ ఈ ముఖాముఖిలలో ఆర్.జి-త్రీ ఏరియా ఉద్యోగుల మహిళా కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల మహిళలు 31 మంది హాజరయ్యారని, అందులోనుండి అనుభవం, నైపుణ్యం, అర్హతల ఆధారంగా శిక్షకులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



# పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చర్యలు

### గ్రామాల్లో ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాల పై అవగాహన కల్పించాలి

### ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాలపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలోని అనాథ , పాక్షిక అనాథ పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఉన్న అనాథ, పాక్షిక అనాథ పిల్లలను పూర్తి స్థాయిలో గుర్తించాలని అన్నారు. పిల్లల తల్లి తండ్రుల పేరు మీద ఏవైనా ఆస్తులు ఉంటే అన్యాక్రాంతం కాకుండా పిల్లలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో అనాథలు, పాక్షిక అనాథలను గుర్తించి వారికి విద్య అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ నుంచి వచ్చే అనాథ, పాక్షిక అనాథ బాలికల జాబితా ను ఆమోదించి కేజిబీవీ లల, గురుకులాలో సీట్లు కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. చదువు ముగిసిన అనాథ పిల్లలు ఏం చేస్తున్నారు అనే అంశం ట్రాక్ చేయాలని అన్నారు. అనాథ పిల్లలు ఎవరికైనా ఏ.టీ.సీ. కోర్సులలో ఆసక్తి ఉంటే నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. చైల్డ్ కేర్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు వచ్చే ప్రతి ఫిర్యాదు అటెండ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. పోక్సో కేసులకు సంబంధించి పరిహారం ఫైల్ మన వద్ద పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. బాల సదనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత స్నాక్స్ అందించడం, ఎంగేజ్ చేయడం వంటి ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అన్నారు. బాలసదనం లో పిల్లలకు మంచి ఆహారం మేన్యూ ప్రకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. బాల సదనంలో పిల్లలు ఎవరు కింద నిద్రపోకుండా బెడ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. సుల్తానాబాద్ లో మంజూరు చేసిన బాల సదనం పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ పనులు ఆలస్యం కాకుండా నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్, దేవాలయాలు, బస్టాండ్, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలలో రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలను అనుమతి లేకుండా నడపడానికి ఆస్కారం లేదని అన్నారు. రిజిస్ట్రేషన్ చేయకుండా నడిపే ఆశ్రమాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో ఐ.సి.పి.ఎస్ కార్యకలాపాల పై అవగాహన కల్పించాలని, అనాథ పిల్లలు, పాక్షిక అనాథ పిల్లల, బాల్య వివాహాలు సమాచారం ప్రజల నుంచి మనకు నేరుగా వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ బాల్యవివాహాలు జరగడానికి వీలు లేదని అన్నారు. జిల్లాలో జరిగే ప్రతి అబార్షన్ కేసు ట్రాక్ చేయాలని అన్నారు. ఆడపిల్ల పుడుతుంది అనే కారణంతో జరిగే అబార్షన్ లను నిలువరించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా నూతల శ్రీనివాస్..



హుజురాబాద్ అక్టోబర్ 30 (ది క్రైమ్ న్యూస్) : హుజూరాబాద్ బార్ అసోసియేషన్ కు చెందిన సుమారు 30 మంది సీనియర్ జూనియర్ న్యాయవాదులు ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రమేష్ అధ్యక్షతన అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అందరు న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్ న్యాయవాదుల సంక్షేమానికి విరుద్ధంగా, న్యాయవాదులను కించపరుస్తూ, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లను అవమానపరుస్తూ, అడ్వకేట్లు సంక్షేమానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, ఒంటెద్దు పోకడలతో న్యాయవాదులకు అన్యాయం చేస్తున్నందున అందరూ న్యాయవాదులు ఏకపక్షంగా అతన్ని అరుణ్ కుమార్ ను అధ్యక్ష పదవి నుండి రీకాల్ చేస్తూ అతన్ని పదవి నుండి తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందన్నారు. అతని స్థానంలో ఉపాధ్యక్ష పదవిలో ఉన్న నూతల శ్రీనివాసును కొత్త అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ నూతన శ్రీనివాస్ కు మాజీ బార్ ప్రెసిడెంట్ అందే వెంకటేశ్వరరావు, బండి కళాధర్, జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేష్, మాజీ జనరల్ సెక్రెటరీ కడార్ల సాంబమూర్తి, ఏబూసి లింగారెడ్డి, కనకం తిరుపతి, ములుగు కొండయ్య, బత్తుల తిరుపతి, కన్నెబోయిన అశోక్, ములుగు సదయ్య, పొట్లపల్లి శ్రీధర్ బాబు తదితరులు అభినందనలు తెలిపారు. కాగా వీరు న్యాయమూర్తులను కలిసి ఈ ఏకగ్రీవ తీర్మాణ ప్రతులను, నూతన అధ్యక్షుడినీ ఎన్నుకున్న దాని గురించి వివరించినట్లు తెలిపారు.

## నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

### మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దీటి రాజు



బెజ్జంకి, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్) : సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ దీటి రాజు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆరుగాలం శ్రమించి పంట కోతకచ్చే తరుణంలో రైతులను అకాల వర్షం ఆగం చేసిందని, ప్రారంభమే తప్ప కొనుగోలు చేయక కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలులో జాప్యం చేయకుండా నష్టపోయిన రైతులకు న్యాయం చేసేలా నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ లేనిపక్షంలో రైతులతో ధర్నాకు సిద్ధమంటూ దీటి రాజు ప్రకటనలో పేర్కొన్నారు.

## నేటి "2కే రన్"ను విజయవంతం చేయండి

### ఎస్ఐ సిరిసిల్ల అశోక్



ఇల్లంతకుంట, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో నేడు నిర్వహించే 2కే రన్ ను విజయవంతం చేయాల్సిందిగా ఎస్ఐ సిరిసిల్ల అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు."రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 7గంటలకు మండలకేంద్రంలోని బస్టాండ్ నుండి 2కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపి అన్ని గ్రామాల్లోని ఔత్సాహికులు, విద్యార్థులు, యువతి, యువకులు, వాకర్స్, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఐ ప్రకటన ద్వారా కోరారు.

## వరద ఉధృతి తగ్గేవరకు నీటి ప్రవాహాన్ని దాటకూడదు

### ఎస్ఐ జి.నరేందర్ రెడ్డి




గన్నేరువరం, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రంలోని ఊర చెరువు మత్తడి వద్ద ప్రవాహ తీవ్రత అధికంగా ఉండడంతో బార్కెట్ లను ఏర్పాటు చేసి గన్నేరువరానికి గురువారం రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. అకాల వర్షం కారణంగా వరద ఉధృతి తగ్గేవరకు నీటి ప్రవాహాన్ని ఎవరు దాటే ప్రయత్నం చేయవద్దని మండల ప్రజలకు ఎస్ఐ జి.నరేందర్ రెడ్డి సూచించారు.


## ఇసుక లారీ పట్టివేత.... ఒకరిపై కేసు నమోదు



తిమ్మాపూర్, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గురువారం ఇసుక లారీనీ పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా నుండి సిద్దిపేటకు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఇసుకతో సహ లారీని స్వాధీనం చేసుకుని నల్లగొండ జిల్లా చెన్నాయిగూడెంకు చెందిన మర్రి నాగరాజు యాదవ్(30)అనే వ్యక్తిపై కేసు నమోదు చేసుకున్నట్లు తెలుపుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.

# విద్యార్థుల హాజరును రోజువారీగా పర్యవేక్షించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి, అక్టోబర్ – 30 (ది క్రైమ్ న్యూస్) : విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాల్లో నాణ్యత పెంపుకు విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో మధ్యాహ్న భోజనం, ఆధార్ నమోదు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు హాజరు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, ఆహార నాణ్యత తనిఖీలు, పిఎం శ్రీ పనులు పురోగతి, భవిత తదిరత కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, హాజరు, మధ్యాహ్న భోజన పథక అమలు, డిజిటల్ విద్య, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పక పాఠశాలలు తనిఖీ చేయాలని అట్టి అంశాలపై నివేదికలు పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. యూ డైస్ నివేదిక ప్రకారం 26 బాలురు, 13 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, అలాగే 24 బాలురు,14 బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉపయోగకరంగా లేవని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఇట్టి పాఠశాలలకు ప్రతిపాదనలు ఇవ్వాలని గత సమావేశంలో చెప్పానని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాలని ఈడబ్ల్యూఐడిఓసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరును రోజువారీగా పర్యవేక్షించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేలా టీచర్లు ప్రత్యేక పాఠశాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా మారేలా విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత పెంపొందించాలని ఆయన సూచించారు. పాఠశాలలు నిర్వహణ ఖర్చులకు ధృవీకరణ నివేదికలు నివ్వాలని ఆదేశించారు. తన పర్యటనలో కంప్యూటర్స్ పరిశీలిస్తున్నానని చాలా చోట్ల పనిచేయడం లేదని మరమ్మతులు నిర్వహించి విద్యార్థులకు ఉపయోగంలోకి తేవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, ఈడబ్ల్యూ ఐడిసి ఏఈ జీవన్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారు.

**ధర్మపురి సి.ఐ రామ్ నరసింహ రెడ్డి.**



ధర్మపురి, అక్టోబర్29, (దిక్రైమ్ న్యూస్) : శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారని ధర్మపురి సి.ఐ రామ్ నరసింహ రెడ్డి అన్నారు. గురువారం ధర్మపురి పట్టణంలో ప్రజల భద్రత చర్యలో భాగంగా పట్టణంలోని పాన్ షాప్, కిరాణా షాప్ లలో పోలీసు నార్కోటిక్ జగిలాలతో, బాంబ్ డిస్పోజల్ టీమ్ సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐ రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం, మత్తు పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో, నేడు ధర్మపురి పట్టణం లో డాగ్ స్క్వాడ్ మరియు బాంబ్ డిస్పోజల్ (బి.డి) టీమ్ సహకారంతో తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా బస్ స్టాండ్ మరియు పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు.
అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యక తనికి నిర్వహించారని సిఐ తెలిపారు.
ధర్మపురి పట్టణం లో తనిఖీ నిర్వహించడం తో పటిష్ట భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నరు. పాన్ షాప్ లలో గంజాయి పదార్థాలను గుర్తించే జగిలాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని, జిల్లాలో గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్న, ఇతరులకు విక్రయించిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని అన్నారు. ఎవరైనా అనుమానాస్పద వస్తువులు, వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్ కి సమాచారం ఇవ్వాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ లు ఉదయ్ కుమార్, రవీందర్, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో పాటు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు

హైదరాబాద్,అక్టోబర్30 : బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. ఇవాళ రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

# స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.
- ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల పై ప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకు?
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిరక్ష్యం చేయడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులకు తరచూ ఆటంకాలు కలుగుతున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గు చేటని, ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని గురువారం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భిక్షాటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని,సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని, గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు 8500 కోట్లు పూర్తిగా పెండింగ్ లో ఉన్నాయని, ఫీజు బకాయిలు విడుదల లేక విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిల విడుదల పై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల విద్యార్థులకు సకాలంలో పరీక్షలు జరగలేదని ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్తే కళాశాలల వారు పరీక్షలు నిర్వహించారని కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల లేక డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, ఇప్పుడు ఇంజనీరింగ్ కళాశాలలు సైతం నవంబర్ 03 నుండి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయని ఇప్పుడిప్పుడే ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులు ప్రారంభం అయ్యాయని ఇంజినీరింగ్ కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న మరియు టోకెన్లు మంజూరు అయిన ఫీజు బకాయిలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం పై భారం తగ్గుతుందని, వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, గుండేటి తరుణ్, లచ్చేటి అభి, నస్పూరి వర్షిత్, ధరణి అరుణ్ , వేముర్ల వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ105వ ఆవిర్భావ దినోత్సవాన్ని వారం రోజులపాటు ఘనంగా నిర్వహించుకుందాం

**ఏఐటీయూసీ నగర కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్‌ల పిలుపు**





గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్) : భారతదేశంలో కార్మిక వర్గ పోరాటాలకు ప్రతినిధ్యం వహిస్తూ ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న స్థాపించబడింది. స్వతంత్ర సమరయోధులు లాలా లజపతిరాయ్, బాల గంగాధర్ తిలక్, జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, వి వి గిరి తో పాటు ఆనాటి కమ్యూనిస్టు కార్మిక సంఘాల నాయకులైన ఎస్ ఏ డాంగే, ఇంద్రజిత్ గుప్తా,పార్వతి కృష్ణన్, ఏబీ బర్ధన్, మగ్దూం మొయినుద్దీన్, రాజ్ బహుదూర్ గౌర్, కే ఎల్ మహేంద్ర లాంటి పోరాట యోధులు ఏఐటీయూసీ కి నాయకత్వం వహించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం ఇవ్వాలని నినదించిన మొట్టమొదటి సారిగా తీర్మానించిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ. స్వతంత్రానికి ముందు తరువాత కార్మిక హక్కుల కొరకు పోరాడి ట్రేడ్ యూనియన్ చట్టం పారిశ్రామిక సంబంధాల ప్రమాదాల పరిహారాల చట్టం, కనీస వేతన చట్టం, బోనస్ గ్రాట్యుటీ – ఈఎస్ఐ, పి ఎఫ్, బీడీ కార్మికుల చట్టం, భవన నిర్మాణ కార్మికుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి 44 కార్మిక చట్టాలను ఏఐటీయూసీ పోరాడి సాధించింది. రామగుండం నియోజకవర్గంలోని అసంఘటిత రంగాలైన మునిసిపల్, ఆర్ టి సి, ఎన్ టి పి సి, ఆర్ ఎఫ్ సి ఎల్, మెడికల్, సింగరేణి, భసంత్ నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ, తెలంగాణ పవర్ ప్రాజెక్ట్, శానిటరీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్ వాడి, ఆశ, ఏ ఎన్ ఎం ఇతర కార్మికులకు హమాలీలకు,భవన నిర్మాణ కార్మికులకు, ఉపాధి హామీ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కనీస కార్మిక చట్టాలైన పిఎఫ్, ఈఎస్ ఐ, గ్రాట్యుటీ,సమాన పనికి సమాన– వేతనం, పనికి తగిన ప్రతిపలం లేని తీవ్రమైన పని ఒత్తిడితో అనేక ఇబ్బందులు ఆటుపోట్లు కార్మిక వర్గం ఎదుర్కొంటుంది. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ పెద్ద నోట్ల రద్దు చేసి స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రతి పౌరునికి బ్యాంకు ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తానని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మాణం, రైతుకు ఆదాయ రెట్టింపు లాంటి బూటక వాగ్దానాలు మోసపూరిత మని తేలిపోయాయి. పూర్తిగా అన్ని రంగాలలో ప్రైవేట్ పరం చేస్తూ ఆదాని, అంబానీలకు వేల కోట్లు కట్టబెట్టి కార్మిక వర్గంపై యుద్ధం చేస్తుంది. 100 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను వీటిలో ముఖ్యమైన 29 చట్టాలను మార్పిడితో వ్యాపారం సులభతరం పేరుతో పెట్టుబడిదారులకు ఆదాని, అంబానీలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను పాలకులు హరించి వేస్తున్నారు. ప్రజలపై నిత్యవసర వస్తువులు పెట్రోల్ డీజిల్ గ్యాస్ లాంటి వస్తువులపై విపరీతంగా ధరలు పెంచి అసంఘటిత కార్మిక రంగం నడ్డి విరుస్తుంది. ప్రభుత్వ రంగంలోని రక్షణ రంగం బ్యాంకులు ఇన్సూరెన్స్,బొగ్గు, ఉక్కు గనులు, రైల్వే, విమానయాన, పోర్టులు పోస్ట్ ఆఫీసులు,బిఎస్ ఎన్ ఎల్, ఆయిల్ కంపెనీ లు ఓ ఎన్ జి ఎస్, బి ఏ ఈ, ఇస్రో లాంటి అనేక పరిశ్రమలను ఆదాని, అంబానీలకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ ప్రైవేట్ పరం చేయబడుతుంది. ఇది యావత్ అన్ని వర్గాల కార్మిక వర్గం గ్రహించాలి. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల బోర్డు సిఫారసు చేసి ఐదు జీవోలను అమలు చేయకుండా పారిశ్రామికవేత్తల అభిప్రాయాలకు వంత పాడుతుంది. సుమారు 18 సంవత్సరాలుగా అటు కేంద్రంతో పాటు ఇటు రాష్ట్రంలో షెడ్యూల్డ్ పరిశ్రమలలో కనీస వేతనాలు పెంచబడలేదు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేస్తామన్న ప్రభుత్వం మాట తప్పింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి–సమాన వేతనం చెల్లించడం లేదు. ఏఐటీయూసీ రామగుండం నియోజకవర్గంలోని సంఘటిత అసంఘటిత రంగాల కార్మికులకు వలస కార్మికులకు వీరితో పాటు ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తానన్న 12000 రూపాయలు ఇవ్వాలని ఆటో డ్రైవర్ కార్మికులకు కూడా అండగా ఉండి వారి సౌకర్యాలు ఇతర కార్మిక ఉద్యోగులకు భద్రత ఉపాధి హక్కులకై ఏఐటీయూసీ పోరాడుతుంది. ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించింది. 105 వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రామగుండం నియోజకవర్గం లోని అన్ని వర్గాల సంఘటిత అసంఘటిత రంగాల కార్మికులు ఆయా పని స్థలాల్లో బస్తీలలో వారం రోజులపాటు ఆవిర్భావ దినోత్సవ సభలు సమావేశాలు నిర్వహిస్తూ ఎర్ర తోరణాలతో ఎరుపుమయం చేసి ఏఐటీయూసీ జెండాలు ఎగురవేయాలని ముఖ్యమైన నాయకులకు సీనియర్స్ ని గుర్తించి శాలువా మెమొంటోలతో సన్మానం సత్కారం చేసి ఒక పండుగ వాతావరణంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరపాలని కార్మిక వర్గానికి ఏఐటీయూసీ రామగుండం నగర సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్ర శేఖర్ లు పిలుపునిచ్చారు.

# పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందజేయాలి

**యువైఏపిఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్.**



భూపాలపల్లి, అక్టోబర్ – 30:(ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో వరి, పత్తి,మిర్చి తదితర పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందజేయాలని యువైఏప్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పత్తి చేన్లపై తడిసి ముద్దయిందని,వరి ఈదురు గాలులతో నెల వాలిందని,చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయని,అంతర్గత రోడ్లు, కొట్టుకపోయాని,ఇండ్లు నెలమట్టం అయ్యాయని, వణుకు,చలిపిడుగులతో ముగజీవాలు మృత్యువాత పడ్డాయని,మానేరు పరివాహక ప్రాంతాల్లో కరెంట్ మోటార్లు,విద్యుత్ తీగలు కొట్టుకపోయాని తెలిపారు. సంబంధించిన అధికారులతో సర్వేలు నిర్వహించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

**ఎన్నారైలు అడ్డూరి శేషి కుమార్, గంజి సాయి కుమార్ స్పందనతో నిరుపేద కుటుంబానికి సహాయం**




రామగిరి, అక్టోబర్ 30(ది క్రైమ్ న్యూస్):– లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల భాగంగా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నారైలు అడ్డూరి శేషి కుమార్, గంజి సాయి కుమార్ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి, ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్ ని సంప్రదించి సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. వారి సహకారంతో రాంనగర్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి ౨ ఇటీవల ఇంటి పెద్ద రాజమౌళి మరియు అతని కుమారుడు నవీన్ మరణించడంతో ముగ్గురు ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్న ఆ మహిళా కుటుంబానికి నిత్యావసర సరుకులు మరియు పిల్లలకు బట్టలు అందజేయడం జరిగింది. అనంతరం, క్లబ్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సమాజ సేవలో ముందుంటుంది. అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం మా క్లబ్ యొక్క ప్రధాన బాధ్యత. ఎన్నారైలు అడ్డూరి శేషి కుమార్ , గంజి సాయి కుమార్ స్పందించి సహకరించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారి వంటి సేవా భావం కలిగిన వ్యక్తుల ప్రోత్సాహం మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శరణ్య యాదవ్,డైరెక్టర్ దొడ్ల శ్రీనివాస్, కొంక రాజు, దొంతుల సురేష్, అసం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలి.

**డిటి తాసిల్దార్‌కు ప్రజాసంఘాల వినతి**



భూపాలపల్లి, అక్టోబర్ – 30:(ది క్రైమ్ న్యూస్) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహ ముత్తారం డిప్యూటీ తాసిల్దారు కు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహా ముత్తారం మండల కేంద్రంలో గురువారం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవన్ కు ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. తహసిల్దార్ మాట్లాడుతూ పై అధికారులకు పంపించి ప్రపోజల్ రాగానే అంబేద్కర్ భవన్ కు మండల కేంద్రంలో స్థలం కేటాయిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పీక కిరణ్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మహా ముత్తారం మండల గౌరవ అధ్యక్షులు లింగమల్ల సడవలి రావ్. మండల అధ్యక్షులు రామగిరి రాజు, ముఖ్య సలహాదారులు గంధం రాజు, ప్రధాన కార్యదర్శి లింగమల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి పులియాల సురేష్,కార్యవర్గ సభ్యులు రాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

# 3న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

### కమిషనర్‌కి నోటీసు ఇచ్చిన కాంట్రాక్టర్లు



విజయనగరం,అక్టోబర్30 : నగర పాలక సంస్థ లో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి, నవంబర్ 3 తేదీన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కు నోటీసు ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు తెలియజేశారు. గురువారం ఉదయం కమిషనర్ కు నోటీసు కాంట్రాక్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము గత 2 సంవత్సరములుగా పూర్తి చేసిన పనులుకు ఈ నాటి వరకు బిల్లులు చెల్లింపులు జరగలేదన్నారు. దీనివలన మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అయినప్పటికినీ మీరు మమ్ములను పిలిచి క్రొత్తపనులకు టెండర్లు వేయండి పనులు చేసిన వెంటనే పేమెంటు ఇస్తానని చెప్పి మాట ఇచ్చారన్నారు. కానీ మేము సకాలంలో పనులు పూర్తి చేసినప్పటికి నేటి వరకు మాకు పేమెంటులు ఇవ్వటం జరగలేదన్నారు. గత బిల్లులు పేమెంట్సులు రాక క్రొత్త బిల్లులకు పేమెంటులు ఇవ్వకపోవడం వలన బ్యాంకుల నుండి మరియు ఇతర వ్యక్తుల నుండి తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని, మానసిక ఒత్తిడికి లోనువుతున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా మామీద త్వరితగతిన పనులు చేయమని మీరు మరియు ఇంజనీరింగు విభాగం వారు ఓత్తిడి తీసుకువస్తున్నారన్నారు. అంతే కాకుండా మాకు నోటీసులు జారీచేస్తుయున్నారన్నారు. ఈ విషయమై మా కోర్ కమిటీ సభ్యులు తమ పిలుపుమేరకు తే 25-10-2025ది శనివారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు మీరు సమావేశం నిర్వహించారు. కానీ మీరు మాకోర్ కమిటీ సభ్యులు చర్చించిన అంశాలు పై మీ నుండి మాకు సానుకూల స్పందన రాకపోవటం వలన తే 03-11-20258 సోమవారం నుండి ప్రస్తుతం చేస్తున్న పనులు నిలుపుదల చేసి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు ఎదుట దర్నా చేయుటకు నిర్ణయించుకొని ఈ నోటీసు ద్వారా తెలియజేస్తున్నామన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగార్రాజు, అర్.రాజ్కుమార్, గౌరవ అద్యక్షులు ఎం.లింగారావు,పి.అశోక్, సభ్యులు నరేంద్ర,పి.శ్రీనివాసరాజు, డి.శ్రీనివాస్, వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, సత్యన్నారాయణ, సబ్యులు పాల్గొన్నారు.

# పెన్నానదిలో భారీగా వరదప్రవాహం

### సంగం బ్యారేజీకి కొట్టుకు వచ్చిన భారీ బోటు

### సమయస్ఫూర్తితో బోటును ఒడ్డుకు చేర్చిన అధికారులు

విజయవాడ,అక్టోబర్ 30 : మొంథా తుఫాన్ ప్రభావంతో పెన్నా నదిలో ఉధృతంగా పెరిగిన వరద ప్రవాహం నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజ్‌కు భారీ ప్రమాదం కలిగించే పరిస్థితి ఏర్పడింది. వరదలో కొట్టుకుపోయిన 30 టన్నుల భారీ బోటు బ్యారేజ్ గేట్లకు అడ్డంగా పడటంతో అధికారులు అప్రమత్త మయ్యారు. తక్షణ చర్యలు చేపట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తుఫాన్ కారణంగా రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలు వాగులు, వంకలు పొంగిపొర్లేలా చేశాయి. పెన్నా నదిపై ఉన్న సంగం బ్యారేజ్‌కు లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. అదే సమయంలో భారీ బోటు ప్రవాహంలో కొట్టుకుపోయి బ్యారేజ్ వైపు చేరింది. అది గేట్లను తాకే పరిస్థితి వస్తే బ్యారేజ్‌కు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో అధికారులు వేగంగా చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల సంఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షణ చేపట్టారు. వారి ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ సిబ్బంది, పోలీసు విభాగం, వ్యవసాయ శాఖ అధికారులు సమిష్టిగా పని చేశారు. దాదాపు 100 మంది సిబ్బంది సహకారంతో ఆ బోటును విజయవంతంగా వెలికితీశారు. మొత్తం 3.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఆధారమైన సంగం బ్యారేజ్ ప్రమాదం నుంచి బయటపడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా యంత్రాంగం సమయోచితంగా స్పందించిందని సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా అధికారులను అభినందిస్తూ, ఆ బోటు అలాగే కిందకు వెళ్లి ఉంటే బ్యారేజ్ గేట్లను ఢీకొని భారీ నష్టం జరిగేదేనని పేర్కొన్నారు. అధికారుల ప్రకారం, బిరపేరు, బొగ్గేరు వాగుల్లో అకస్మాత్తుగా నీటి మట్టం పెరగడంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సంగం బ్యారేజ్ వద్ద నీరు 11 అడుగులకు చేరుకుంది. ఈ వరద వేగం కారణంగా వంతెన రైలింగ్‌కు కట్టిన మూడు బోట్ల తాళ్లు తెగిపోయాయి. వాటిలో ఒకటి ఇసుక తిన్నెల్లో చిక్కుకోగా, మరోటి కనిగిరి రిజర్వాయర్ వైపుకు వెళ్లింది. మూడో బోటు మాత్రం బ్యారేజ్‌కు కేవలం 400 మీటర్ల దూరంలో నిలిచిపోవడంతో వెంటనే చర్యలు తీసుకుని రక్షించారు. అధికారుల చాకచక్యంతో నెల్లూరు సంగం బ్యారేజ్ పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


# తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం

### పైరు పొట్ట దశలో ఉండగా తుపాను దెబ్బ

### 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి

### రైతులకు తోడుగా నిలబడాలని పార్టీ నేతలకు జగన్ పిలుపు

అమరావతి,అక్టోబర్ 30 : తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా దెబ్బతింటాయి. నేలకొరిగిన పంట తిరిగి నిలబడ్డం కష్టమయ్యే పరిస్థితి. దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయం తో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలన్నారు. 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామన్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదని జగన్ విమర్శించారు.



# నేటి నుంచి రేడియాలజిస్టుల మహాసభ

### గీతం వర్సిటీ వేదికగా మూడురోజుల సభలు

విశాఖపట్నం,అక్టోబర్30 : గీతం మెడికల్ కాలేజ్ ఆడిటోరియం వేదిక గా ఈ నెల అక్టోబర్ 31, నవంబర్ 1, 2 తేదీలలో రాష్ట్ర రేడియాలజిస్టుల వార్షిక మహాసభ జరుగనుందని ఎపిఐఆర్ఐఎ అధ్యక్షుడు డాక్టర్ వి. సురేష్ (డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్) తెలిపారు. గురువారం ఉదయం విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలను పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ , రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సంయుక్తంగా ప్రారంభిస్తారని గీతం ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ గీతాంజలి బాట్ మానాభనే, ఎన్ఆర్ఐ రేడియాలజిస్టు డాక్టర్ ముక్కమాల అప్పారావు, నేషనల్ ఐఆర్ఐఎ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి. మోహన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. సదస్సు మొదటి రోజు, అక్టోబర్ 31న, ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నామని రాష్ట్రంలో తొలిసారిగా సిమ్యులేషన్ పద్ధతిలో భ్రూణ దశలోని శిశువుపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్వెన్షన్ విధానాలైన అమ్నియోసెంటీసిస్, షంట్ ప్లేస్‌మెంట్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు తమిళనాడుకు చెందిన డాక్టర్ భావహరణ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సతర్కర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ ప్రధాన ఫ్యాకల్టీగా వ్యవహరించ నున్నారని తెలిపారు. రెండవ ,మూడవ రోజుల్లో వైద్య ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈసారి రికార్డు స్థాయిలో 160 రేడియాలజీ పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. వీటిలో ఉత్తమ 12 పత్రాలను వేదికపై ప్రదర్శించి, అత్యుత్తమ మూడు పత్రాలకు పురస్కారాలు అందజేయనున్నామని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర స్థాయి రేడియాలజీ క్విజ్ నిర్వహించనున్నారు. దీనిని ఎయిమ్స్ న్యూ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాజుశర్మ నిర్వహించనున్నారు. ఆయనే ఈ సంవత్సరపు ప్రతిష్ఠాత్మకమైన 'కాకర్ల సుబ్బారావు ఉపన్యాసం'ను కూడా ఇవ్వనున్నారని అదేవిధంగా తిరుపతికి చెందిన ఎస్.వి.ఐ.ఎం.ఎస్. ప్రొఫెసర్ ఆఫ్ రేడియాలజీ డాక్టర్ ఎ. వై. లక్ష్మి కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 750 మంది రేడియాలజిస్టులు, వైద్య అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు హాజరై వైద్య విద్యలో కొత్త ధోరణులు, టెక్నాలజీ వినియోగం, రేడియాలజీ శిక్షణలో అభివృద్ధి మార్గాలు వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశం సందర్భంగా ఎపి ఐఆర్ఐఎ జనరల్ బాడీ మీటింగ్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ బుజ్జిబాబు (హెచ్.ఓ.డి., కె.జి.హెచ్.), ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ వర్మ (హెచ్.ఓ.డి., అపోలో ఆసుపత్రులు), డాక్టర్ రఘు (గీతం కళాశాల) పాల్గొన్నారు.

## మున్నేరు, కృష్ణా ప్రవాహాలపై

# నిరంతర అప్రమత్తత

### ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,అక్టోబర్ 30 : తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద పోటెత్తుతోందని.. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు.. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మున్నేరు వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు అటూఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెనువెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్.. ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ రహదారులకు సంబంధించి కూడా ప్రణాళికలు ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ల్గ÷తులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి కూడా వరద నీరు పోటెత్తుందోని.. ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువున, దిగువున ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు.

# తన పిల్లలు చిత్రసీమలోకి వస్తారనుకోలేదు

### తుక్కమ్ ప్రారంభోత్సవంలో మోహన్ లాల్

కొచ్చి : తన పిల్లలు సినిమాల్లోకి వస్తారని తానెప్పుడూ అనుకోలేదని ప్రముఖ నటుడు,దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్ అన్నారు. కెరీర్ విషయంలో వారికి స్వేచ్ఛ ఇచ్చానని తెలిపారు. 'తుడక్కమ్' ప్రారంభోత్సవ వేడుకలో మాట్లాడారు. తానూ ఊహించని రీతిలోనే ఇండస్ట్రీలోకి వచ్చానంటూ నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తన కూతురు విస్మయ నటిస్తున్న తొలి సినిమానే 'తుడక్కమ్'. '2018' మూవీ ఫేమ్ జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. వేడుకనుద్దేశించి మోహన్‌లాల్ మాట్లాడుతూ.. 'సినిమాల్లో నటించాలని నేను కోరుకోలేదు. నేను నటుడిని కావడం విధి. గత 48 ఏళ్లుగా ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. వారి వల్లే నేనీ స్థాయిలో ఉన్నా. నా పిల్లల విషయానికొస్తే వారికంటూ కొన్ని లక్ష్యాలున్నాయి. వారి అభిప్రాయాలను గౌరవించేవాడిని. సినిమాల్లో నటించడం అనుకున్నంత సులువు కాదు. కానీ, విస్మయ నటిని కావాలని నిశ్చయించుకోవడంతో ఆమెకు కావాల్సిన సపోర్ట్ ఇచ్చాం. మంచి కథతో సినిమా రంగంలోకి వస్తోంది' అని పేర్కొన్నారు. తమ కుటుంబానికి ఈ ఏడాది ఎంతో ప్రత్యేకమని మోహన్‌లాల్ సతీమణి సుచిత్ర అభిప్రాయపడ్డారు. మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం, తనయుడు ప్రణవ్ కొత్త సినిమా విడుదల కాబోతుండటం (ఈ నెల 31న రిలీజ్ కానున్న డియాస్ ఇరాయ్ ), తనయ నటిగా ప్రయాణం మొదలుపెట్టడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# తిరుమల ఇవోతో శ్రీశైలం ఛైర్మన్ భేటీ

### శ్రీశైలంలో టిటిడి వసతి సమాదాయానికి వినతి

తిరుమల,అక్టోబర్ 30 : టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ను శ్రీశైలం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గురువారం కలిశారు. తిరుమలలో జరిగిన ఈ భేటీలో స్వామివారి వస్త్రము, ప్రసాదం అందజేసి దోర్నాల దగ్గర భక్తులు, యాత్రికుల కోసం టీటీడీ వసతి సముదాయం, డార్మెటరీ నిర్మించాలని కోరారు. అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ క్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సానుకూలంగా స్పందించారని.. టీటీడీ తరపున బోర్డు మెంబెర్ భాను ప్రకాష్ రెడ్డిని శ్రీశైలం వెళ్లి ఎన్ని గదులు అవసరం అవుతాయో పరిశిలించి టీటీడీ పాలకమండలి తెలియజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పదిరోజుల్లో శ్రీశైలం దర్శనానికి వచ్చి వసతి సముదాయాల గురించి పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక ఇస్తామని చెప్పారని అన్నారు రమేష్ నాయుడు.

# కారు డ్రైవర్ కంచిపల్లి శ్రీనివాస్ అదృశ్యం విషాదాంతం

### వైనతేయ నదీపాయలో శవమై కనిపించిన యువకుడు

కోనసీమ,అక్టోబర్ 30 : అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన కారు డ్రైవర్ కంచిపల్లి శ్రీనివాస్ (37) ఘటన విషాదాంతమైంది. గత శనివారం అదృశ్యమైన అతడు బుధవారం పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగపల్లి గ్రామంలోని వైనతేయ నదీ పాయలో శవమై కనిపించాడు. అతడి సోదరుడు అంజి పుట్టు మచ్చల ఆధారంగా శ్రీనివాస్ మృతదేహాన్ని గుర్తించాడు. ఈ కేసును అమలాపురం పట్టణం, పి.గన్నవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతి చెంది దాదాపు ఐదు రోజులు అవుతుందని, పోస్టుమార్టం నివేదిక వస్తేనే మృతికి కారణాలు తెలుస్తాయని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఇదిలా ఉండగా.. శ్రీనివాస్ భార్య దేవి, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. తన భర్త అదృశ్యం కేసు ఎంత వరకూ వచ్చిందని ఆరా తీశారు. ఇదే విషయాన్ని పట్టణ పోలీస్ స్టేషన్ ముందు విలేకరులకు తెలిపారు. ఆర్.ఏనుగపల్లిలో ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారని తెలిసి ఆమె పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ మృతదేహం తన భర్తదే అని నిర్ధారణ కావడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. గత శనివారం శ్రీనివాస్ ఇంట్లో తాను రాజమహేంద్రవరం వెళుతున్నానని చెప్పి స్కూటీపై బయలు దేరాడు. అప్పటి నుంచి అతను తిరిగి రాలేదు. ఆర్.ఏనుగపల్లిలో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైనప్పుడు అక్కడి పోలీసులు అతడి శరీరంపై సినీ దర్శకుడు సుకుమార్ చిత్రంతో పాటు పలు పేర్లను టాటూలుగా వేయించుకున్న విషయాన్ని గుర్తించారు. అతడి కుడి చేతిపై దేవి, రిషి, వినీత్ అనే పేర్లు ఇంగ్లిషులో ఉన్నాయి. నీలి రంగు ప్యాంట్ ఊడిపోయి అతని కాళ్ల వద్ద వేలాడుతోంది. తన భర్తను పట్టణానికి చెందిన గంగుమళ్ల కాసుబాబు, అతడి అనుచరులు చంపినట్టు తనకు అనుమానంగా ఉందని మృతుడి శ్రీనివాస్ భార్య దేవి స్థానిక విలేకర్లకు తెలిపింది. తన భర్తపై కాసుబాబు కక్ష పెంచుకుని ఇదంతా చేశాడని ఆరోపించింది. కాసుబాబుతో పాటు శంకర్, సలాది అప్పన్న, కారు డ్రైవర్ కలిపి తన భర్తను చంపారన్న అనుమానం ఉందని తెలిపింది. పట్టణ పోలీసులు ఈ నలుగురి కదలికలపై నిఘా పెట్టారు. తాము కూడా ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

# సంగం బ్యారేజికి తప్పిన ముప్పు: అనిత

విజయవాడ,అక్టోబర్ 30 : అధికారుల ముందస్తు చర్యలతో నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సంగం బ్యారేజీకి కొట్టుకువచ్చిన 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించారని తెలిపారు. సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారన్నారు. నంద్యాల జిల్లా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. కోవెలకుంట్ల మండలం స్వామినగర్, బిజినవేములలో కూలిన మట్టి మి÷-దదెలను పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి.. పునరుద్ధరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

# పులిచింతలకు భారీగా వరదనీరు

### ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద

అమరావతి,అక్టోబర్30 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పులిచింతల ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ప్రాజెక్ట్‌కు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో.. అధికారులు 4 లక్షల 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్‌కు 2 లక్షల 74 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. దీంతో అధికారులు బ్యారేజ్ అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు మున్నేరు, కీసర, వైర, కట్టలేరు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. సాయంత్రానికి ప్రకాశం బ్యారేజ్‌కు పులిచింతల నుంచి సుమారు 4 లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్‌కు సాయంత్రానికి సుమారు 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బ్యారేజ్ దిగువ భాగాన ఉన్న కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలలోని నదీతీర మండలాలు, గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లంక గ్రామాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు కోరారు. భారీ వర్షాలకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతోందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ వద్ద దిగవకు వరద నీటి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతానికి ఇన్ ఎ÷-లో, ఔట్ ఎ÷-లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. బ్యారేజ్ వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని.. వరద ఎలో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. క్రమక్రమంగా వరద తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నదిలో ప్రయాణం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

# డయాబెటిస్ పేషెంట్స్ కొబ్బరి నీళ్లు తాగొచ్చా.? నిపుణులు ఏమంటున్నారు



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచిదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందులోని ఎలక్ట్రోలైట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మరీ ముఖ్యంగా సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లు రుచి విషయంలో తియ్యగా ఉంటాయి. దీంతో డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తాగ కూడదనే భావనలో ఉంటారు. ఇంతకీ డయాబెటిస్ రోగులు కొబ్బరి నీళ్లు తీసుకుంటే ఎమైనా ప్రమాదం ఉంటుందా.? నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పాల కంటే కొబ్బరి నీటిలో



ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఇందులోని కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. క్రమం తప్పకుండా తినే వ్యక్తులు వారి శరీరంలో పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లను పొందుతారు. లేత కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం నుంచి ట్యాక్సిన్లు తొలగిపోతాయి. అయితే కొబ్బరి నీళ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి డయాబెటిస్ పేషెంట్లకు మంచిది కాదనే అభిప్రాయంలో నిజం లేదని నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీటిని ఎలాంటి సందేహం లేకుండా తాగొచ్చని చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొబ్బరిని తాగడం వల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్య రాకుండా చూస్తుంది. ఇక కొబ్బరి బోండ లోపల ఉండే కొబ్బరిని కూడా తినొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో మెటబాలిజం మెరుగుపరచడంలో సహాయపడే అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే, క్రీమ్ తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుంది, అందువల్ల క్రీమ్‌ను రెగ్యులర్ డైట్‌లో భాగం చేసుకోవాలి. ఇందులో మంచి కొలెస్ట్రాల్ ఉంటుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

# తులసి నీళ్లు రోజూ తాగితే అమృతం తాగినట్లే..! అందం, ఆరోగ్యంతో పాటు బోలెడు ప్రయోజనాలు!

యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఈ వేడి సీజన్‌లో తులసి నీటిని తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయం టున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పానీయం శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో సహాయపడుతుంది. దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగపడతాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. తులసి నీరు కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో ఒత్తిడిని కలిగించే ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. తులసి నీటిని తాగడం వల్ల



కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే మీరు ఒత్తిడి లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది.

## తెల్లగా ఉన్నాయ్ ఇవేం చేస్తాయిలే అనుకునేరు.. ఆ సమస్యలకు దివ్యౌషధం..



ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను ఆరోగ్యానికి నిధిగా భావిస్తారు.. వాస్తవానికి ఉల్లిపాయలు లేకుండా ఏ కూరగాయల రుచి కూడా బాగుండదు.. సాధ్యమైనంత మేరకు ఉల్లి లేకుండా కూరనే వండరు.. అందుకే.. ఏదిఏమైనప్పటికీ.. ఇంట్లో ఉల్లి ఉండాల్సిందే.. ఇంకా ఉల్లిపాయను సలాడ్‌లో కూడా ఉపయోగిస్తారు. వాస్తవానికి అందరి ఇళ్లల్లో ఎర్ర ఉల్లిపాయను ఉపయోగిస్తుంటారు.. ఎర్ర ఉల్లిపాయల వలే తెల్ల ఉల్లిపాయల్లో కూడా ఎన్నో పోషకాలు దాగున్నాయి. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకోండి.. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. జీర్ణవ్యవస్థ బలపడుతుంది : తెల్ల ఉల్లిపాయ అనేక సమస్యలను దూరం చేస్తుంది. ఈ ఉల్లిపాయను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను బలంగా ఉంచుతుంది. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ ఆరోగ్యాన్ని బలపరుస్తుంది. ఇది కాకుండా, ఉల్లిపాయలో ప్రీబయోటిక్ ఉంటుంది. ఇది పొట్టను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జుట్టు సమస్యలు దూరం: తెల్ల ఉల్లిపాయ మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది. మీకు చుండ్రు సమస్య ఉంటే తెల్ల ఉల్లిపాయ రసాన్ని వినియోగించాలి. రసాన్ని తలపై అప్లై చేసి కొంత సేపటి తర్వాత తలను శుభ్రం చేసుకోవాలి. ఇంకా తెల్ల జుట్టు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తింటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్ తగ్గుతుంది: తెల్ల ఉల్లిపాయలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరం నుంచి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. మీకు కూడా చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా ఉంటే, మీరు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తినడం ప్రారంభించాలి. ఇది మీ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది: తెల్ల ఉల్లిపాయను తీసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉన్నాయి.. ఇది మీ రక్తపోటును పెరగకుండా చేస్తుంది.. ఇంకా రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది. అందువల్ల, మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, మీరు తెల్ల ఉల్లిపాయలను తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.

## కేవలం రూ.20తో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి బయటపడొచ్చు.. ఎలాగో తెలుసా?



శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్‌ను తగ్గించగల 5 ప్రభావవంతమైన హెూమ్ రెమెడీస్ ఇవే.. ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి. ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది. యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది. రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది. ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి.

## చామదుంపలో ఉండే ఈ గుణం గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది..! డయబెటీస్‌కు బెస్ట్ ఫుడ్..!!



విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ బి 6, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న చామదుంపలు చాలా ఇళ్లలో ఇష్టంగా తింటారు. దాని రుచిని ఇష్టపడని వారు కూడా ఉన్నారు. మీరు కూడా అలాంటి వారిలో ఒకరైతే, ఈ రోజు మేము దాని ప్రయోజనాలను మీకు తెలియజేస్తాము. ఇది తెలిసిన తర్వాత మీరు తప్పక మీ ఆహారంలో భాగంగా చేర్చుకుంటారు. వేసవిలో బలహీనమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో, అనేక శరీర సమస్యల నుండి ఉపశమనం పొందడంలో చామగడ్డను తినడం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. చామగడ్డలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎక్కువ ఫైబర్ తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. మొత్తంమీద, దీనిని తినడం వల్ల మీ మొత్తం గుండె ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుతుంది. బరువు తగ్గడంలో ప్రయోజనకరంగా ఉంటుంది.. ఊబకాయంతో బాధపడేవారికి చామదుంపలు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. వేసవిలో దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీకు ఎక్కువసేపు ఆకలి అనిపించదు. అదనపు కేలరీలను తీసుకోకుండా మిమ్మల్ని మీరు ఆపుకోగలుగుతారు. దీని ప్రభావం బరువులో కనిపిస్తుంది. ఈ విధంగా చామగడ్డను మీ ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల బరువు తగ్గడానికి చాలా మంచిది. కళ్లకు మేలు చేస్తుంది.. బీటా-కెరోటిన్, క్రిప్టోక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున చామగడ్డ తీసుకోవడం వల్ల మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రెటీనా దెబ్బతినకుండా కాపాడతాయి. కంటిశుక్లం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. అటువంటి పరిస్థితిలో చిన్న వయస్సులోనే కంటి సంబంధిత సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ప్రారంభించినట్లయితే, ఆహారంలో చామగడ్డను తరచుగా చేర్చుకోవడం మంచిది. కండరాలు, ఎముకలకు మేలు చేస్తుంది. చామదుంప రెగ్యులర్ వినియోగం కండరాలు, ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది . ఐరన్, కాపర్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలుఈ కూరగాయలలో ఉన్నాయి. ఇది ఎముకల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. చాలా మంది ప్రజలు వేసవిలో తక్కువ రోగనిరోధక శక్తితో పోరాడుతున్నారు. అటువంటి పరిస్థితిలో చామదుంపను రెగ్యూలర్‌గా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్‌తో పాటు పెరిగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడడంలో శరీరానికి సహాయపడుతుంది. దీని వినియోగం విటమిన్ సి లోపాన్ని కూడా తొలగిస్తుంది. ఇది ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.

## అలర్ట్.. డయాబెటిస్‌ను కంట్రోల్ చేసే ఏడు సూత్రాలు.. ఇలా చేస్తే 400 ఉన్న షుగర్ 100కు రావడం ఖాయం..



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. హార్మోన్ల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు మీ శరీరంలో వేళ్లూనుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, థైరాయిడ్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు హైపో లేదా హైపర్ థైరాయిడిజానికి దారితీస్తాయి. అదేవిధంగా, ఇన్సులిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాకపోయినా లేదా సరిగ్గా పని చేయకపోయినా, రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణంగా ఉండవు. చాలా సందర్భాలలో, చక్కెర స్థాయి పెరుగుతుంది. దీనివల్ల మధుమేహం, ప్రీ-డయాబెటిస్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు వస్తాయి. మధుమేహంతో పాటు, ఇన్సులిన్ నిరోధకత కొలెస్ట్రాల్ స్థాయిలు, థైరాయిడ్ పనితీరు, రక్తపోటును కూడా ప్రభావితం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారం ద్వారా ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించవచ్చు.. అలాంటి ఆహార పదార్థాలు ఏంటో తెలుసుకోండి.. ఏడు సూత్రాలతో డయాబెటిస్‌కు చెక్.. మెంతులు దనియాల నీరు: మెంతులు, దనియాల నీటిని రోజూ తీసుకోవడం వల్ల ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. 1/2 టీస్పూన్ మెంతి గింజలు, 1 టీస్పూన్ దనియాలను ఒక గ్లాసు నీటిలో వేసి మరిగించి తాగండి.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. గుండెల్లో మంటగా ఉన్నా.. అజీర్ణంతో బాధపడుతున్నా ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. ఉసిరి అలోవెరా జ్యూస్: ఉసిరి, కలబంద రెండూ ఇన్సులిన్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ పానీయంలో విటమిన్ సి ఉంటుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి, పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ పానీయం రక్తంలోని అదనపు గ్లూకోజ్‌ను గ్రహిస్తుంది. సరైన పద్ధతిలో ఆహారాన్ని తినండి: ఆహారంలో సరైన మొత్తంలో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు ఉండాలి. రోజు ప్రారంభంలో ఫైబర్ తీసుకోండి. ఆ తర్వాత ప్రోటీన్.. చివరకు పిండి పదార్థాలు లాంటివి తీసుకోవాలి.. అయితే. మితంగా తినడం మాత్రం మర్చిపోవద్దు.. ప్రోటీన్లు పుష్కలంగా ఉండే ఆహారం: శరీరంలో ప్రోటీన్ల లోపాన్ని తీర్చడానికి గుడ్లు, చికెన్, బాదం, కాజు, పప్పులు వంటివి తినండి.. ఇటువంటి ఆహారాలు ఇన్సులిన్ హార్మోన్ ప్రభావాన్ని పెంచుతాయి. రోజులో ఏదైనా భోజనంలో ప్రోటీన్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే బ్లడ్ షుగర్ లెవెల్ మెయింటెయిన్ అవుతుంది. దాల్చిన చెక్క నీరు:దాల్చిన చెక్కఇన్సులిన్ నిరోధకత..రక్తంలోచక్కెర స్థాయిలను నియంత్రించడంలో గ్రేట్ గా పనిచేస్తుంది.ఈ మసాలాలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దాల్చిన చెక్క పొడిని వేడి నీటిలో మరిగించి తాగాలి..రోజులో ఏదో ఒకపూట ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పుష్కలంగా నీరు త్రాగండి: ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి..వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి పుష్కలంగా నీరు త్రాగాలి. రోజంతా 3-4 లీటర్ల నీరు త్రాగాలి..దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉంటాం..రాత్రి భోజనం తర్వాత నడవండి: రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకోకండి. రాత్రి భోజనం తర్వాత కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు నడవండి. ఇది ఆహారాన్ని జీర్ణం చేస్తుంది.. వ్యాధి ప్రమాదాన్ని నివారిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.



# వ్యాపారం

## మీరు ఎస్‌బీఐ కార్డులు ఉపయోగిస్తున్నారా..? అయితే మీకో బ్యాడ్ న్యూస్..




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తమ ఖాతాదారులకు ఒక బ్యాడ్ న్యూస్ చెప్పింది. ఎస్‌బీఐ కార్డులపై ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏ బ్యాంక్ అయిన తమ ఖాతాదారులకు అందించే కార్డులపై ఛార్జీలు వసూలు చేస్తుందనే విషయం తెలిసిందే. ఈ ఛార్జీలను బ్యాంకులు ఏడాదికి ఒకసారి అకౌంట్ హోల్డర్స్ నుంచి వసూలు చేస్తాయి. అయితే తాజాగా ఈ ఛార్జీలను పెంచుతూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకుంది. కొన్ని డెబిట్ కార్డులకు సంబంధించిన వార్షిక మెయింటెనెన్స్ ఛార్జీలను పెంచుతున్న ఎస్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. పెంచిన ఈ ఛార్జీలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందులో భాగంగా ఎస్‌బీఐ క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై ఛార్జీలను ఏకంగా రూ. 75 పెంచేసింది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీ రూ. 125తో పాటు అదనంగా జీఎస్టీ ఉండగా ప్రస్తుతం దీనిని రూ. 200లతో పాటు జీఎస్టీకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇక యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డ్, మై కార్డ్ (ఇమేజ్ కార్డ్) వాంటి వాటిపై ఏకంగా 50 శాతం మేర ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ కార్డులపై వార్షిక ఛార్జీలు రూ. 175ం జీఎస్టీగా ఉండగా, ప్రస్తుతం రూ. 250ం జీఎస్టీకి పెంచచారు. వీటితో పాటు ప్లాటినమ్ డెబిట్ కార్డు ఛార్జీలను కూడా పెంచేశారు. వీటిపై యాన్యువల్ ఛార్జీలను 30 శాతం పెంచారు. ప్రస్తుతం వీటిపై ఏడాదికి రూ. 250 ప్లస్ జీఎస్టీగా ఉండగా, రూ. 325కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బీఐ ప్రైడ్ ప్రీమియమ్ బిజినెస్ డెబిట్ కార్డు వంటి వాటి ప్రీమియం కార్డుల ఛార్జీల్ని రూ. 350 ప్లస్ జీఎస్టీ నుంచి రూ. 425 ప్లస్ జీఎస్టీగా నిర్ణయించింది. ఇక్కడ జీఎస్టీ ప్రతి దాంట్లో 18 శాతంగా ఉంటుంది. ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో యూజర్లపై భారం పడనుంది.

## హీరో ఈవీ స్కూటర్‌పై షాకింగ్ ఆఫర్లు.. ఏకంగా రూ.27 వేల తగ్గింపు



భారతదేశంలో ఈవీ వాహన మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతుంది. అన్ని కంపెనీలు సరికొత్త ఆఫర్లను అందిస్తూ ఈవీ వాహనాల కొనుగోలును ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఆర్థిక ముగింపు నేపథ్యంలో ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నాయి. తాజాగా హీరో మోటోకార్ప్‌కు సంబంధించిన ఎలక్ట్రిక్ బ్రాండ్ విడా ఎలక్ట్రిక్ స్కూటర్‌పై కంపెనీ ఆకర్షణీయమైన తగ్గింపులను అందిస్తోంది. ముఖ్యంగా మార్చి 31లోపు విడా ఈవీ స్కూటర్ కొనుగోలు చేస్తే రూ.27 వేల భారీ తగ్గింపును అందిస్తుంది. అయితే అధునాతన ఫీచర్లతో వచ్చే ఈవీ స్కూటర్‌పై ఆఫర్లను ఎలా పొందాలో? తెలుసుకుందాం. మార్చి నెలలో తమ అమ్మకాలను పెంచుకోవడానికి అనేక ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారులు ఆఫర్లు, డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ క్రమంలో విడా ఎలక్ట్రిక్ స్కూటర్‌పై హీరో ఎలక్ట్రిక్ కూడా డిస్కౌంట్లను అందిస్తోంది. మార్చి 2024లో విడా వీ1 లైనప్‌లో రూ. 27 వేల వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని కంపెనీ అందిస్తోంది. కంపెనీ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ప్యాకేజీ వాలిడిటీ ఐదేళ్లపాటు ఉంటుంది. ఈ స్కూటర్ మార్చి 31, 2024 లోపు కొనుగోలు చేసినట్లయితే ఐదు సంవత్సరాలు లేదా 50 వేల కిలోమీటర్ల పొడిగించిన బ్యాటరీ వారంటీని, రెండు వేల కంటే ఎక్కువ ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్‌లకు యాక్సెస్, ఉచిత సేవ, 24ఐ7 రోడ్‌సైడ్ అసిస్టెన్స్‌ను అందిస్తుంది. యాప్‌లో కనెక్టివిటీ, సేఫ్టీ ఫీచర్‌లను ఉపయోగించడానికి అనువుగా ఉంటుంది. హీరో కంపెనీకు సంబంధించిన విడా ఎలక్ట్రిక్ స్కూటర్ క్రూయిజ్ కంట్రోల్, బూస్ట్ మోడ్, టూ-వే థొరెటల్, కీ-లెస్ యాక్సెస్, ఏడు అంగుళాల టీఎఫ్‌టీ టచ్‌స్క్రీన్ వంటి అనేక ఫీచర్లతో అందిస్తున్నారు. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం ఈ స్కూటర్‌ను పూర్తి ఛార్జ్ తర్వాత 110 కిలోమీటర్ల వరకు నడపవచ్చు. దీని గరిష్ట వేగం గంటకు 80 కిలోమీటర్ల వరకు ఉంటుంది. విడా వీ1 ప్లస్ వేరియంట్‌ను హీరో మోటోకార్ప్ నుండి రూ. 97800 ఎక్స్-షోరూమ్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అలాగే విడా వి1 ప్రో ఎలక్ట్రిక్ స్కూటర్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 1.26 లక్షలుగా ఉంది.

## న్యూ డిజైన్, కెమెరా అప్‌గ్రేడ్స్‌తో ఆకట్టుకోనున్న వన్‌ప్లస్ 13

వన్‌ప్లస్ 12కు కొనసాగింపుగా రానున్న వన్‌ప్లస్ 13 స్పెసిఫికేషన్స్ ఆన్‌లైన్‌లో లీకయ్యాయి. ఫ్రెష్ డిజైన్, కెమెరా అప్‌గ్రేడ్స్‌తో ఈ డివైజ్ కస్టమర్ల ముందుకు రానుందని చెబుతున్నారు. లీకైన వివరాల ప్రకారం కెమెరా మాడ్యూల్‌లో మార్పులతో పాటు డిజైన్‌లో మార్పుచేర్పులు ఉంటాయని భావిస్తున్నారు. రానున్న వన్‌ప్లస్ 13 రీవ్యాంప్డ్ కెమెరా మాడ్యల్ డిజైన్ కలిగిఉంటుందని వన్‌ప్లస్ క్లబ్ పోస్ట్ వెల్లడించింది. వన్‌ప్లస్ 12 సిరీస్‌లో కనిపించే డిజైన్‌కు భిన్నంగా వన్‌ప్లస్ 13 రీడిజైన్‌తో కస్టమర్ల ముందుకు రానుంది. ఒప్పో సబ్సిడరీ వన్‌ప్లస్ లేటెస్ట్ డివైజ్‌లో 50 ఎంపీ మెయిన్ కెమెరా, 6ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో కూడిన 50 ఎంపీ పెరిస్కోర్ కెమెరాలు వంటి ఫీచర్లను కలిగిఉంటుందని డిజిటల్ చాట్ స్టేషన్ అంచనా వేసింది. వీటికి తోడు వన్‌ప్లస్ 13 క్వాల్‌కాం నెక్ట్స్ జెన్ చిప్ స్నాప్‌డ్రాగన్ 8జెన్ 4చిప్‌సెట్‌పై రన్ అవుతుందని భావిస్తున్నారు. ఇక వన్‌ప్లస్ 13 2కే స్క్రీన్, అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్‌ను కలిగిఉంటుందని అంచనా.



# ఎఫ్‌డీల్లో పెట్టుబడితో రాబడితో పాటు నష్టాలెన్నో..!
# సీనియర్ సిటిజన్లకు ఈ జాగ్రత్తలు మస్ట్

భారతదేశంలో చాలా మంది కష్టపడి సంపాదించిన సొమ్మును నమ్మకమైన రాబడి కోసం ఫిక్స్ డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెడుతున్నారు. అయితే ఎఫ్‌డీలను మన సొమ్ముకు ఎంత భద్రతనిస్తాయో? అంతేస్థాయిలో నష్టాలు తీసుకొస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ద్రవ్యోల్బణం వల్ల ఎఫ్‌డీలు పెద్ద ముప్పును ఎదుర్కొంటాయని స్పష్టం చేస్తున్నారు. ద్రవ్యోల్బణం వల్ల 20 సంవత్సరాల వ్యవధిలో మన ఎఫ్‌డీలపై 60 శాతం రాబడిని తగ్గించవచ్చని నిపుణులు అంటున్నారు. ఎఫ్‌డీలు స్థిరత్వం, హామీతో కూడిన రాబడిని అందిస్తున్నప్పటికీ అవి ద్రవ్యోల్బణానికి సంబంధించిన ప్రభావాలకు అతీతం కావని గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత స్థిరమైన ఆదాయం కోసం తరచుగా ఎఫ్‌డీలపై ఆధారపడే సీనియర్ సిటిజన్లకు ఇది ఒక ప్రత్యేక సవాలుగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీల పెట్టుబడితో వచ్చే రిస్క్‌ల గురించి వివరాలను తెలుసుకుందాం. ఎఫ్‌డీల మన సొమ్ముకు మంచి భద్రతను అందిస్తున్నా వాటి రాబడులు ద్రవ్యోల్బణం ద్వారా గణనీయంగా తగ్గుతాయి. ఉదాహరణకు ఎవరైనా ఆరు శాతం వార్షిక



వడ్డీ రేటుతో ఎఫ్‌డీలో రూ.1 కోటి పెట్టుబడి పెడితే వార్షిక ద్రవ్యోల్బణం రేటు ఐదు శాతంగా నిర్ణయించిన తర్వాత పెట్టుబడికి సంబంధించిన వాస్తవ విలువ కాలక్రమేణా గణనీయంగా తగ్గిపోతుంది. 20వ సంవత్సరం నాటికి ద్రవ్యోల్బణం ఎఫ్‌డీ రిటర్న్ నుంచి దాదాపు రూ. 2 కోట్లను నష్టం చేకూరుస్తుంది. దీర్ఘకాలిక పొదుపుల పై ద్రవ్యోల్బణానికి సంబంధించిన ప్రతికూల ప్రభావాన్ని అంచనా వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు, ప్రత్యేకించి స్థిర ఆదాయ వనరులపై ఆధారపడే వారు పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా ద్రవ్యోల్బణానికి సంబంధించిన ప్రభావాలకు గురవుతారు. ఈ ప్రమాదాన్ని తగ్గించడానికి నిపుణులు తమ పెట్టుబడి పోర్ట్ఫోలియోను ఎఫ్‌లకు మించి వైవిధ్యపరచాలని సీనియర్లకు సలహా ఇస్తున్నారు. మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్మెంట్ ట్రస్ట్‌లు, బంగారం, బాండ్లు వంటి ఆస్తుల్లో పెట్టుబడి పెట్టాలని వివరిస్తున్నారు. ఇవి దీర్ఘకాలికంగా ఎఫ్‌డీలతో పోల్చితే చారిత్రాత్మకంగా మెరుగైన రాబడిని అందిస్తాయని పేర్కొంటున్నారు. సీనియర్లు మ్యూచువల్ ఫండ్లలో సిస్టమాటిక్ ఉపసంహరణ ప్రణాళికలు ఎంచుకోమని సలహా ఇస్తున్నారు. ఇవి ఎఫ్‌డీల కంటే మెరుగైన పోస్ట్-టాక్స్ రిటర్న్‌ను అందించేటప్పుడు స్థిరమైన ఆదాయ ప్రవాహాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఇండెక్స్డ్ బాండ్ల వంటి ద్రవ్యోల్బణం రక్షిత సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టడం వల్ల కూడా మంచి ఆదాయాన్ని పొందవచ్చని చెబుతున్నారు. వృద్ధులకు ఆర్థిక పరిస్థితుల గురించి తెలియజేయడంతో అనుభవజ్ఞులైన ఆర్థిక నిపుణుల సహాయంతో వారి పెట్టుబడి పోర్ట్ ఫోలియోను క్రమం తప్పకుండా సమీక్షించడం చాలా అవసరం. వైవిధ్యభరితమైన విధానాన్ని అవలంబించడంతో వారి పొదుపుపై ద్రవ్యోల్బణం ప్రభావాన్ని అర్థం చేసుకోవడం ద్వారా సీనియర్లు పదవీ విరమణలో వారి ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవచ్చని వివరిస్తున్నారు.

# ఆటోమొబైల్ రంగంలో విప్లవం..
# సముద్రపు నీటితో నడిచే కారు ఆవిష్కరణ

పెరుగుతున్న టెక్నాలజీ కారణంగా సరికొత్త ఆవిష్కరణలు అందరినీ అబ్బురపరుస్తున్నాయి. సాధారణంగా కారు అంటే ఇందనం లేదా ఇటీవల కాలంలో విద్యుత్ శక్తితో నడుస్తాయి. అయితే సముద్రపు నీటితో నడిచే కారును ఇటీవల ఓ కంపెనీ అభివృద్ధి చేసింది. క్వాంట్-ఈ స్పోర్ట్‌లిమౌసిన్ పేరుతో సముద్రపు నీటితో నడిచే మొట్టమొదటి కారును జర్మన్ కంపెనీ క్వాంట్ అభివృద్ధి చేసింది. ఈ కారు కేవలం ఉప్పునీటితో ఇంధనంగా పనిచేసే ఎలక్ట్రోలైట్ ఫ్లో సెల్ పవర్ సిస్టమ్‌పై నడుస్తుంది. ఈ కారు నడిచేది విద్యుత్ శక్తితో అయినా ఆ విద్యుత్‌ను సముద్రుప నీటితో పొందవచ్చు. ఈ సాంకేతికత ఎలక్ట్రిక్ వాహనాలలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ కారు గురించి వివరాలను తెలుసుకుందాం. ఎలక్ట్రిక్, హైడ్రోజన్ ఇంధన సెల్ కార్లు ఇటీవలి కాలంలో ప్రజాదరణ పొందాయి. అయితే ఆయా కార్ల బ్యాటరీలను రీఛార్జ్ చేయడంతో పాటు హైడ్రోజన్ ట్యాంకులకు ఇంధనం నింపడం పెద్ద సమస్యగా మారుతుంది. ఈ నేపథ్యంలో క్వాంట్ కంపెనీ తీసుకొచ్చిన తాజా ఆవిష్కరణతో ఆ సమస్యలకు చెక్ పడనుంది. క్వాంట్-ఈ స్పోర్ట్‌లిమౌసిన్ సముద్రపు నీటి శక్తిని వినియోగించే ప్రత్యేకమైన పవర్‌ట్రెయిన్‌ని ఉపయోగించి పనిచే స్తుంది. ఇది విద్యుత్ విశ్లేషణ అనే ప్రక్రియ ద్వారా సముద్రపు నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విభజించే విద్యుత్ విశ్లేషణ రియాక్టర్‌ను ఉపయోగించుకుంటుంది . ఉత్పత్తి చేసిన హైడ్రోజన్ కారు ఇంధన కణాలలోకి అందించబడుతుంది. అయితే ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదల అవుతుంది. ఇంధన కణాల లోపల హైడ్రోజన్ గాలి నుండి ఆక్సిజన్‌తో కలిసి విద్యుత్ ప్రవాహాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఈ విద్యుత్తు కారుకు సంబంధించిన ఎలక్ట్రిక్ మోటార్లతో పాటు అన్ని ఇతర విద్యుత్ వ్యవస్థలకు శక్తినివ్వడానికి ఉపయోగిం చబడుతుంది. క్వాంట్- ఈ స్పోర్ట్‌లిమౌసిన్ ఒక ఎలక్ట్రిక్ వాహనం. అయితే ఇది రీఛార్జ్ చేయడానికి ఎలక్ట్రిక్ గ్రిడ్‌లోకి ప్లగ్ చేయాల్సిన అవసరం సముద్రపు నీటిని ఇంధన వనరుగా ఉపయోగించి డిమాండ్‌పై దాని సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది చాలా ఇతర ఎలక్ట్రిక్ వాహనాలతో పోలిస్తే ఇది అత్యుత్తమ శ్రేణి, రీఫ్యూయలింగ్ సామర్థ్యాలను అందిస్తుంది. పవర్‌ట్రెయిన్ పూర్తిగా ఉద్గార రహితంగా




వస్తుంది. క్వాంట్-ఈ స్పోర్ట్‌లిమౌసిన్ నానోఫ్లోసెల్ హోల్డింగ్స్ ద్వారా రిలీజ్ చేసింది. లీచ్‌టెన్‌స్టెయిన్‌లో ఉన్న ఒక పరిశోధన, అభివృద్ధి సంస్థ. ఈ కంపెనీ ఫ్లో సెల్ బ్యాటరీ, డ్రైవ్ టెక్నాలజీపై దృష్టి పెడుతుంది . నానోఫ్లోసెల్ ఉప్పునీటితో నడిచే ఎలక్ట్రిక్ వాహనాన్ని రూపొందించే లక్ష్యంతో 2014లో క్వాంట్ ఇ-స్పోర్ట్‌లిమౌసిన్‌ని అభివృద్ధి చేయడం ప్రారంభించింది. 2014లో మొదటి డ్రైవ్ చేసే ప్రోటోటైప్‌ను ఆవిష్కరించడానికి ముందు కంపెనీ ఫ్లో సెల్ టెక్నాలజీని పరిశోధించడం, పరీక్షించడం కోసం చాలా సంవత్సరాలు గడిపింది. విస్తృతమైన పరీక్ష, శుద్ధీకరణ తర్వాత, నానోఫ్లోసెల్ 2018లో క్వాంట్ ఇ-స్పోర్ట్‌లిమౌసిన్‌కు సంబంధించిన తుది ఉత్పత్తి నమూనాను వెల్లడించింది. ఉప్పునీటితో ఇంధనంగా నడిచే ఫ్లో సెల్ బ్యాటరీతో నడిచే మొదటి స్ట్రీట్-లీగల్ ఎలక్ట్రిక్ వాహనంగా కంపెనీ దీనిని పేర్కొంది .

## చరిత్రలో తొలిసారిగా బీజింగ్‌ను వెనక్కి నెట్టిన ముంబై.. బిలియనీర్ల నిలయంగా ముంబై



దేశ ఆర్థిక రాజధాని ముంబై ఇప్పుడు బిలియనీర్ల నిలయంగా మారింది. బీజింగ్‌కు ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను ముంబై లాగేసుకుంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2024 తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం, ప్రస్తుతం 92 మంది బిలియనీర్లు ముంబైలో నివసిస్తున్నారు. చరిత్రలో తొలిసారిగా ముంబై బీజింగ్‌ను వెనక్కి నెట్టింది. మన ముంబైకి చెందిన ఈ బిలియనీర్లు తమ సంపదను నిరంతరం పెంచుకుంటున్నారు. మరోవైపు పొరుగున ఉన్న చైనా పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ ధనవంతుల సంపద క్రమంగా తగ్గుతూ వస్తోంది. ముంబై నగరంలో కొత్తగా 27 మంది బిలియనీర్లు హురున్ రిచ్ లిస్ట్ ప్రకారం ముంబై నగరంలో కొత్తగా 27 మంది బిలియనీర్లు చేరారు. మరోవైపు, బీజింగ్‌లో ఈ సంఖ్య 6 మాత్రమే. భారతదేశంలో పెరుగుతున్న బిలియనీర్ల సంఖ్య దేశ పటిష్ట ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉంది. భారతదేశం పెరుగుతున్న ఆర్థిక బలాన్ని ప్రపంచం మొత్తం గుర్తించింది. కొత్త బిలియనీర్ల సంఖ్య పరంగా భారతదేశం ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ పేరు మొదటి స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత ధనవంతుడు. ప్రపంచంలోని అగ్రశ్రేణి సంపన్నుల జాబితాలో ముఖేష్ అంబానీ పేరును చేర్చడం ద్వారా భారతదేశ ఆర్థిక ఆధిపత్యం కొనసాగుతోంది. భారతదేశంలో సంపద పెరిగింది.. చైనాలో తగ్గింది భారతదేశం, చైనాల మధ్య సంపద వృద్ధి ధోరణులు పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తున్నాయి. చైనాలోని 573 బిలియనీర్ల సంపదలో క్షీణత ఉంది. అదే సమయంలో, ఈ ధోరణి భారతదేశంలో 24 మంది బిలియనీర్లతో మాత్రమే కనిపించింది. ప్రపంచ ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశ మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే 51 శాతం పెరిగింది. ముంబై సంపద కూడా 47 శాతం పెరిగితే బీజింగ్‌లో 28 శాతం తగ్గింది. ఇది ఆసియాలోని నగరాల్లో ముంబై స్థానాన్ని మరింత బలోపేతం చేసింది. భారతదేశంలోని బిలియనీర్ల సగటు సంపద కేవలం 3.8 బిలియన్ డాలర్లు. చైనాది కేవలం 3.2 బిలియన్ డాలర్లు. ముంబై పురోగతి గ్రాఫ్ వేగంగా పెరుగుతోంది. ముంబై పురోగతి గ్రాఫ్ వేగంగా పెరుగుతోందని హురున్ ఇండియా వ్యవస్థాపకుడు, ప్రధాన పరిశోధకుడు అనస్ రెహ్మాన్ జునైద్ అన్నారు. గ్లోబల్ రిచ్ లిస్ట్ 2024 దీనిని నిర్ధారిస్తోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రయాణంలో భారతదేశంలోని బిలియనీర్లు కూడా తమ పూర్తి సహకారం అందిస్తున్నారు.

## దేశీ మార్కెట్‌లో త్వరలో వివో ఎక్స్ ఫోల్డ్ 3 లాంచ్



దేశీ మార్కెట్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ వివో ఎక్స్ ఫోల్డ్ 3ని వివో త్వరలో లాంచ్ చేయనుంది. అత్యంత థిన్ డిజైన్‌తో రానున్న ఈ ఫోల్డబుల్ ఫోన్ శక్తివంతమైన క్వాల్‌కాం స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 3 ప్రాసెసర్‌పై రన్ అవుతుంది. భారత్‌లో ఇప్పటికే వన్‌ప్లస్ ఓపెన్, గెలాక్సీ జడ్ ఫోల్డ్ 5 పేరుతో రెండు ప్రముఖ ఫోల్డబుల్ డివైజ్‌లు ఉండగా వివో ఎక్స్ ఫోల్డ్ 3 ఎంట్రీపై ఆసక్తి నెలకొంది. అయితే ఈ దిగ్గజ బ్రాండ్లకు వివో ఫోల్డబుల్ ఎలాంటి పోటీ ఇస్తుందనేది ఉత్కంఠ రేపుతుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. ఎక్స్ ఫోల్డ్ 2 12.9 ఎంఎం స్లీక్‌తో సన్నటి ఫోన్‌గా మార్కెట్‌లోకి రావడంతో దాని కొనసాగింపుగా వస్తున్న వివో ఎక్స్ ఫోల్డ్ 3 మరింత థిన్‌గా ఉండనుంది. ఇక వివో చైనా మార్కెట్‌లో వివో ఎక్స్ ఫోల్డ్ 3, ఎక్స్ ఫోల్డ్ 3 ప్రొను లాంఛ్ చేయడంతో స్పెసిఫికేషన్స్‌పై క్లారిటీ నెలకొంది. వివో ఎక్స్ ఫోల్డ్ 3, ఫోల్డ్ 3 ప్రొ ఒకే ఓఎల్‌ఈడీ డిస్‌ప్లేను కలిగిఉంటాయి. ఎక్స్ ఫోల్డ్ 3 ప్రొ ఇంటిగ్రేటెడ్ అల్ట్రా-సోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్ ఫీచర్‌ను కలిగిఉంది. ఇక డిజైన్ విషయానికి వస్తే వివో ఎక్స్ ఫోల్డ్ 3 సిరీస్‌లో రెండు వేరియంట్లలో స్టాండర్డ్ వేరియంట్ ఫోల్డ్ చేసినప్పుడు కేవలం 4.65 ఎంఎంతో థిన్నెస్ట్ ఫోల్డబుల్ ఫోన్‌గా చెబుతున్నారు. ఇది ఐఫోన్ 15 ప్రొ మ్యాక్స్ కంటే బరువు తక్కువగా ఉంటుంది. కెమెరా ఫీచర్లను పరిశీలిస్తే వివో ఎక్స్ ఫోల్డ్ 3 వెనుకభాగంలో మూడు కెమెరాలు ఉన్నాయి. 50ఎంపీ మెయిన్ కెమెరా, వైడ్‌యాంగిల్ షాట్స్ కోసం మరో 50ఎంపీ కెమెరా, పోర్ట్రయిట్ షాట్స్ కోసం 50ఎంపీ రెగ్యులర్ వెర్షన్ కమెరాలున్నాయి. ఎక్స్ ఫోల్డ్ 3 5500ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో 80డబ్ల్యూ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ చేయనుండగా, ఫోల్డ్ 3 ప్రొ 100డబ్ల్యూ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్‌తో 5700ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం కలిగిఉంది.

## భారత్‌లో 22.5లక్షల వీడియోలు డిలీట్ చేసిన యూట్యూబ్..! కారణాలు ఏంటంటే..?

గూగుల్ యాజమాన్యంలో యూట్యూబ్ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో భారత్‌లో 22.5లక్షల వీడియోలను తొలగించింది. కమ్యూనిటీ కమ్యూనిటీ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు వీడియోలను తొలగించినట్లు యూట్యూబ్ తెలిపింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా 90లక్షల వీడియోలను తొలగించినట్లు ఓ నివేదిక పేర్కొంది. ఈ వీడియోల్లో 96శాతం కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించినట్లు గుర్తించామని.. అయితే 53.46శాతం వీడియోలు ఒక వ్యూ రాక ముందే తొలగించినట్లు నివేదిక పేర్కొంది. కమ్యూనిటీ మార్గదర్శకాల్లో స్పమ్, సున్నితమైన కంటెంట్, హింసాత్మక కంటెంట్, తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్ మొదలైనవి ఉన్నాయి. ఇక అక్టోబర్-డిసెంబర్ 2023 మధ్య 2కోట్ల ఛానెల్స్‌ను సైతం డిలీట్ చేసింది. గత త్రైమాసికంతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపుగా ఉందని నివేదిక పేర్కొంది. అయితే, ఛానెల్స్‌ను రద్దు చేసిన సమయంలో వీడియోలు సైతం తొలగించనున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో 9 కోట్లకుపైగా వీడియోలు తొలగించినట్లు యూట్యూబ్ పేర్కొంది. ఛానెల్స్ తొలగింపునకు ప్రధాన కారణాల్లో స్పామ్, తప్పుదారి పట్టించే కంటెంట్ 92.8శాతం ఉందని.. 4.5శాతం అశ్లీల కంటెంట్ ఉందని పేర్కొంది. అయితే, యూట్యూబ్ 90 రోజుల్లో మూడుసార్లు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే యూట్యూబ్ ఛానెల్‌ను రద్దు చేస్తుంది. భారత్‌లో 22.5లక్షల వీడియోలను తొలగించగా.. ఆ తర్వాత సింగపూర్ (,124,387), అమెరికాలో (7,88,354) వీడియోలను తొలగించింది.

ఆరోగ్యకరమైన పండ్లతో రోజును ప్రారంభించడం వల్ల మొత్తం శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఖాళీ కడుపుతో పండ్లు తినడం వల్ల శక్తి పెరుగుతుంది, జీర్ణ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది, బరువు నిర్వహణలో సహాయపడుతుంది.అయితే, ఉదయం ఖాళీ కడుపుతో కొన్ని పండ్లు మాత్రమే తినడం మంచిది. ఉదయం ఖాళీ కడుపుతో తినడానికి ఉత్తమమైన ఆరు పండ్ల వివరాలు ఇక్కడ ఉన్నాయి.

# ఖాళీ కడుపుతో ఈ పండ్లు తింటే...



**పుచ్చకాయ:**



పుచ్చకాయ నీటితో నిండిన పండు. మేల్కొన్న తర్వాత శరీరాన్ని రీహైడ్రేట్ చేసుకోవడానికి ఇది గొప్ప ఎంపిక. దీనిలోని అధిక నీటి శాతం ఎంతో ఉపకరిస్తుంది. ఇందులో అధిక విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయపడుతుంది.

**బొప్పాయి:**



బొప్పాయిలో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు, ప్రోటీన్‌లను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో బొ ప్పాయి తినడం వల్ల ప్రేగు కదలికలు నియం త్రణలో ఉంటాయి. మలబద్ధకం నివారించ వచ్చు. ముఖ్యంగా పిల్లలకు బొప్పాయి ఇవ్వడం వల్ల ప్రేగులను శుభ్రపరచడంలో సహాయ పడుతుంది.

**పైనాపిల్:**



పైనాపిల్‌లో విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. మాంగనీస్ శరీరంలో ఎంజైమ్ పనితీరు, యాంటీ ఆక్సి డెంట్ రక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఖాళీ కడుపుతో పైనాపిల్ తినడం రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వ డంలో, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దీని లోని ఫైబర్, బ్రోమెలైన్ ఎంజైమ్ జీర్ణక్రియ మెరుగు పరుస్తాయి.

**బెర్రీలు:**




బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీలు, రాస్బ్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీ ఆక్సి డెంట్లు, ఫైబర్, విటమిన్లు పుష్కలం. ఖాళీ కడుపుతో వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు నియం త్రిస్తుంది. బరువు నిర్వహణలో కూడా సహాయపడుతుంది.

**అరటిపండ్లు:**



అరటిపండ్లు పొ టాషియం గొప్ప వనరు. ఇది ద్రవ సమతుల్యతను, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడే ముఖ్యమైన ఖనిజం. ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం ఆరోగ్య కరమైన రక్తపోటుకు మద్దతు ఇస్తుంది. ఉదయం సహజంగా శక్తి పెరుగుతుంది.


## రాత్రిళ్లు ఫోన్ ఎక్కువగా చూస్తే మీ అయుష్షు గోవిందా..!



అర చేతిలోకి ఫోన్ వచ్చాక మనలో చాలా మంది ఉదయం నుంచి రాత్రి వరకు దానితోనే గడిపేస్తుంటాం. క్రమంగా ఇది మన రోజువారీ జీవితంలో ఒక భాగమై పోతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యుల కంటే స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర గాడ్జెట్‌లు అన్ని సమయాలలో విస్తృతంగా ఉపయోగించడం నేటి కాలంలో సాధారణమై పోయింది.స్మార్ట్‌ఫోన్‌లు వాడకంతో ప్రపంచం ఒక్కసారిగా మీ అర చేతిలోకి వచ్చింది. కానీ ఇవి నెమ్మదిగా, అత్యంత రహస్యంగా మీ ఆరోగ్యంపై దారుణంగా దెబ్బకొడతాయని మీకు తెలుసా? అవును.. థానేలోని హారిజన్ ప్రైమ్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుహీల్ ధన్సే దీని గురించి ఏం చెబుతున్నారంటే..ఎక్కువసేపు స్క్రీన్ సమయం తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. ఇవి గుండె ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తాయని చెబున్నారు. ఉక్కువసేపు ఫోన్ స్క్రీన్ చూడటం.. ఎక్కువసేపు కూర్చోవడం, సరైన భంగిమ లేకపోవడం, రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవడం, సరైన బ్రేక్ ఫాస్ట్ తీసుకోకపోవడం వంటి వాటితో ముడిపడి ఉంటుంది. ఇవన్నీ తీవ్రమైన గుండె రోగాలకు దారితీస్తాయని అంటున్నారు. మీరు ఎక్కువసేపు స్క్రీన్‌లను చూడటం వల్ల వచ్చే కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. దీనిని సాధారణ అలసటగా తోసిపుచ్చవచ్చు. కానీ తరచుగా అవి కనిపిస్తే మాత్రం వెంటనే అలర్ట్ అవ్వాలని డాక్టర్ ధన్సే అంటున్నారు. ముఖ్యంగా అలసట, తలనొప్పి, నిద్ర లేకపోవడం, దడ, మాటల్లో చెప్పలేని ఆందోళన వంటివి ముందస్తు హెచ్చరిక సంకేతాలు. రాత్రిపూట ఫోన్ నుంచి వెలువడే నీలి కాంతి వల్ల శరీర గడియారం కూడా దెబ్బతింటుంది. ఇది అధిక రక్తపోటు, బరువు పెరగడం, మధుమేహం వంటి సమస్యలను తీవ్రతరం చేస్తుంది. ఇవన్నీ గుండె జబ్బులకు దారితీసే ప్రమాద కారకాలే.స్క్రీన్‌టైమ్ మీ మొత్తం ఆరోగ్యంపై బహుముఖ ప్రభావాన్ని చూపుతుంది. వంగి ఉన్న భంగిమ వల్ల మెడ నొప్పి, నిరంతరం స్క్రోలింగ్ చేయడం వల్ల మణికట్టు బిగుసుకుపోవడం వంటి తీవ్రమైన హృదయ సంబంధ ప్రమాదాలకు దారి తీస్తాయి. సుదీర్ఘకాలం ఒకే చోట కూర్చుని నిష్క్రియాత్మకంగా ఉండటం వల్ల రక్త ప్రసరణ తగ్గుతుంది. దీనివల్ల సిరల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం పెరుగుతుంది. నిశ్చల జీవనశైలి రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయానికి దారి తీస్తుంది. ఇవన్నీ గుండెపోటు, స్ట్రోక్‌లకు బలమైన కారకాలు. అధిక ఒత్తిడి, స్క్రీన్‌ను అతిగా ఉపయోగించడం వల్ల నిద్రలేమి వేధిస్తుంది. ఇలాంటి వ్యక్తులలో క్రమరహిత గుండె లయలను (అరిథ్మియా) ప్రేరేపిస్తాయని డాక్టర్ ధన్సే తెలిపారు. అనేక అధ్యయనాల ఆధారంగా, స్క్రీన్‌లపై 4 నుండి 6 గంటల కంటే ఎక్కువ సమయం గడిపే వారికి మెటబాలిక్ సిండ్రోమ్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇది కరోనరీ ఆర్టరీ వ్యాధి వచ్చే అవకాశాన్ని నేరుగా పెంచుతుంది.గుండెను కాపాడుకోవడానికి దినచర్యపై తగిన శ్రద్ధ పెట్టాలని కార్డియాలజిస్ట్ డాక్టర్ ధన్సే సూచించారు. ప్రతి 30-40 నిమిషాలకు చిన్న విరామాలు తీసుకోవాలి. ఈ సమయాన్ని క్రమంగా సాగదీయాలి.

### పీరియడ్స్ టైంలో
## తలస్నానం చేస్తే ఏమవుతుంది?

పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదని చాలా మంది అంటుంటారు. అందుకే చాలా మంది ఈ సమయంలో తల స్నానం మానేస్తారు. అయితే దీని వెనుక నిజంగా ఏదైనా కారణం ఉందా?అనే విషయం ఇక్కడ తెలుసుకుందాం..నిజానికి చాలా ఇళ్లలో ఇప్పటికీ పీరియడ్స్ సమయంలో స్త్రీలను వంటగదిలోకి కూడా అనుమతించరు. ఇలాంటి దురాచారాలు మన దేశంలో వేళ్లూనుకుపోయాయి. వీటిని అంత తేలిగ్గా వదిలించుకో వడం మన సమాజంలో సాధ్యంకాదు.ఇలాంటి అపోహల్లో పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదు అనేది ఒకటి. అందుక చాలా మంది మహిళలు ఈ సమయంలో తల స్నానం చేయరు. కొందరు అసలు స్నానం కూడా చేయరు.నిజానికి పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత చాలా అవసరం. పీరియడ్స్ సమయంలో ఎంత ఎక్కువ పరిశుభ్రతను



పాటిస్తే అంత మంచిది. పీరియడ్స్ సమయంలో ప్రతిరోజూ స్నానం చేయడం అస్సలు మర్చిపోకూడదు.పీరియడ్స్ సమయంలో స్నానం చేస్తే శరీరం సాంత్వన పొందుతుంది. ఇది అసౌకర్యాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. రోజుకు రెండుసార్లు స్నానం చేయడం ఇంకా మంచిది.

## రోజూ ఒక్క గ్లాస్ నిమ్మరసం తాగితే చాలు..

నమ్మలేని ఆరోగ్య ప్రయోజనాలు మీసొంతం! నిమ్మకాయ నీరు విటమిన్ సి, ఖనిజాలతో నిండి ఉంటుంది. ఇది శరీరానికి సహజ శక్తి పానీయంగా పనిచేస్తుంది. దీని పోషకాలు శరీరాన్ని ఉత్తేజపరచడానికి, అలసటను తగ్గించడానికి సహాయపడతాయి.యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉన్న నిమ్మరసం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది జలుబు, ఫ్లూ, సీజనల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి మీకు సహాయపడుతుంది.క్రమం తప్పకుండా నిమ్మరసం తాగడం వల్ల టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయి. మీ వ్యవస్థ శుభ్రం అవుతుంది. కాలేయం పనితీరు మెరుగుపడుతుంది. బరువు పెరగడానికి కష్టపడుతున్నవారికి.. నిమ్మరసం ఒక సహజమైన సహాయంగా చెప్పవచ్చు. ఇది జీవక్రియను పెంచుతుంది. క్రేవింగ్స్ తగ్గిస్తుంది.కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది.ఉదయం ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఉబ్బరం తగ్గిస్తుంది. ఎసిడిటీని సమర్థవంతంగా తగ్గిస్తుంది. నిమ్మరసంలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి మొటిమలను తగ్గిస్తాయి. ఇది చర్మాన్ని కాంతివంతంగా, స్పష్టంగా,



యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.నిమ్మరసం రక్తపోటును నియంత్రిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి.. గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది. గుండెను బలంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా నిరోధిస్తుంది. అంతేకాకుండా ఇది కిడ్నీలను శుభ్రపరచి, ఆరోగ్యంగా ఉంచుతుంది.నిమ్మకాయ నీరు తాజా శ్వాసను అందించడమే కాకుండా, కావిటీస్, పంటి నొప్పి, చిగురువాపు వంటి దంత సమస్యలను కూడా నివారిస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మకాయ నీరు తాగడం ఉత్తమం. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, రోజంతా శరీరాన్ని ఉత్తేజపరుస్తుంది.


Crime News ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

### టైర్లపై ఉండే Q లేదా R అక్షరాల
## అర్థం ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు!

కొత్త కారు లేదా బైక్ కొనుగోలు చేసేటప్పుడు మనం తరచుగా దాని ఇంజిన్, మైలేజ్, డిజైన్, లక్షణాలపై దృష్టి పెడతాము. కానీ వాటి టైర్ల గురించి పెద్దగా పట్టించుకోరు.టైర్లపై కూడా ఎన్నో విషయాలు దాగి వుంటాయి. మీ కారును రోడ్డుపై ఉంచడమే కాకుండా, దాని భద్రత, పనితీరు రెండింటికీ బాధ్యత వహిస్తాయి. టైర్ సైడ్‌వాల్‌పై రాసిన L, M, N, P, Q, R, H, V, Z అక్షరాలను మీరెప్పుడైనా గమనించారా? వాటి అర్థం ఏంటో తెలుసా? వాస్తవానికి వేగానికి సంబంధించి రేటింగ్‌ను సూచిస్తాయి. ఈ అక్షరాలు మీ కారు సురక్షితంగా నడపగల గరిష్ట వేగాన్ని నిర్ణయిస్తాయి.

**స్పీడ్ రేటింగ్ అంటే ఏమిటి?**
స్పీడ్ రేటింగ్ అంటే టైర్ ఎంత గరిష్టంగా సురక్షితంగా పని చేయగలదో నిర్ణయించే సామర్థ్యం. ఈ రేటింగ్ పరీక్షించిన తర్వాత నిర్ణయిస్తారు. ప్రతి టైర్‌పై ఆంగ్ల అక్షరాల టైర్లను తయారు చేస్తారు. మీకు ఒక ఉదాహరణ చెప్పాలంటే.. టైర్ Q అని ఉన్నట్లయితే అది 160 km/h వేగాన్ని తట్టుకోగలదని అర్థం. అయితే "R" అని ఉంటే అది 170 km/hవేగాన్ని తట్టుకోగలదని అర్థం. అలా టైర్లపై ఉండే ఆంగ్ల ఆక్షరాలు వేగానికి సంబంధించినవిగా సూచిస్తాయి.

**సరైన స్పీడ్ రేటింగ్ ఉన్న టైర్‌ను ఎంచుకోవడం ఎందుకు ముఖ్యం?**
భద్రత మీరు మీ వాహనం గరిష్ట వేగం కంటే తక్కువ వేగం రేటింగ్ ఉన్న టైర్లను నడుపుతుంటే టైర్ వేడెక్కి పగిలిపోవచ్చు. ఇది ప్రమాద ప్రమాదాన్ని పెంచుతుంది. పనితీరు - సరైన వేగ రేటింగ్ ఉన్న టైర్ వాహన స్థిరత్వం, నియంత్రణను నిర్వహిస్తుంది. ముఖ్యంగా హైవేలపై డ్రైవింగ్ చేస్తున్నప్పుడు. ఇవి ఎక్కువ కాలం పాటు ఉంటాయి. దాని సామర్థ్యాన్ని బట్టి టైర్ మెరుగ్గా పనిచేస్తుంది.
ఈ రేటెడ్ టైర్లకు గరిష్ట సురక్షిత వేగం గంటకు 120 కి.మీ.
స్పీడ్ రేటింగ్ దీని అర్థం టైర్ 160 కి.మీ/గం వరకు సురక్షితంగా ఉంటుంది. ఇది సాధారణంగా ఆఫ్-రోడ్ వాహనాలు. SUVలు, కొన్ని ట్రక్కులలో కనిపిస్తుంది.





ఇక్కడ అధిక-వేగ పనితీరు కంటే టార్క్, గ్రిప్ ముఖ్యమైనవి.
స్పీడ్ రేటింగ్ ఇది 170 కి.మీ/గం వేగం వరకు సురక్షితం. రేటెడ్ టైర్లు సాధారణంగా పికప్ ట్రక్కులు, కొన్ని భారీ వాహనాలకు అమర్చబడి ఉంటాయి.మీరు స్పోర్ట్స్ కారు నడుపుతుంటే, టైర్లకు Q, R రేటింగ్ మాత్రమే ఉంటే అవి మీ వాహనానికి తగినవి కావు. అలాంటి వాహనాలకు సాధారణంగా V Z రేటింగ్ ఉన్న టైర్లు అవసరమని నిపుణులు చెబుతున్నారు.

**టైర్లను ఎంచుకునేటప్పుడు ఏ విషయాలను గుర్తుంచుకోవాలి?**
యజమాని మాన్యువల్‌ని తనిఖీ చేయండి: కారు తయారీదారు మాన్యువల్ దాని మోడల్‌కు సిఫార్సు చేసిన వేగ రేటింగ్‌లు, టైర్ పరిమాణాలను స్పష్టంగా పేర్కొంటుంది.డ్రైవింగ్ విధానాన్ని అర్థం చేసుకోండి: మీరు నగరంలో తక్కువ దూరం డ్రైవ్ చేస్తే, చాలా ఎక్కువ స్పీడ్ రేటింగ్ ఉన్న టైర్లు అవసరం లేదు. అయితే మీరు ఎక్కువ దూరం డ్రైవ్ చేస్తే, హైవేపై అధిక వేగంతో డ్రైవ్ చేస్తే కంటే ఎక్కువ రేటింగ్ ఉన్న టైర్లను ఎంచుకోండి.లోడ్ సూచిక టైర్లకు స్పీడ్ రేటింగ్ మాత్రమే కాకుండా లోడ్ ఇండెక్స్ కూడా ఉంటుంది. ఇది టైర్ సపోర్ట్ చేయగల గరిష్ట బరువును సూచిస్తుంది. నాణ్యత, బ్రాండ్ స్థానిక టైర్లపై స్పీడ్ రేటింగ్ వాస్తవ పరీక్షకు సరిపోలకపోవచ్చు. అందుకే ఎల్లప్పుడూ విశ్వసనీయ బ్రాండ్ నుండి టైర్లను ఎంచుకోండి.

**దానిని విస్మరించడం ఎందుకు ఖరీదైనది కావచ్చు?**
భారతదేశంలో చాలా ప్రమాదాలు సరైన టైర్లను ఉపయోగించడం వల్ల సంభవిస్తాయి. టైర్లపై ఉన్న హోదాలు కేవలం సాంకేతికపరమైనవని అనుకుంటారు.

### ఇక పెట్రోల్, డీజిల్ సంగతి మర్చిపోండి
## మారుతి నుంచి హైబ్రిడ్ కార్లు..!

తన మార్కెట్‌ను బలోపేతం చేయడానికి మారుతి సుజుకి రాబోయే సంవత్సరంలో (బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం), బలమైన హైబ్రిడ్, ఫ్లెక్స్-ఫ్యూయల్ మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా పవర్‌ట్రెయిన్ వ్యూహాన్ని అనుసరించాలని యోచిస్తోంది.ఆటోమేకర్ ప్రధానంగా బలమైన హైబ్రిడ్ వాహనాలపై దృష్టి సారిస్తోంది. దాని మాస్-మార్కెట్ ఉత్పత్తుల కోసం ఇన్-హౌస్ సిరీస్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇంతలో రాబోయే ప్రీమియం మారుతి మోడళ్లలో టయోటా నుండి సేకరించిన అట్కిన్సన్ సైకిల్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌లు ఉంటాయి. ఈ హైబ్రిడ్ కార్లు పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్ మోటారు రెండింటినీ ఉపయోగిస్తాయి. తక్కువ ఉద్గారాలు, మంచి ఇంధన సామర్థ్యాన్ని అందిస్తాయి.ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్ పెరుగుతున్న నేపథ్యంలో 'హైబ్రిడ్' అనే పదం చర్చల్లో ఉంది. చాలామందికి ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కారు మధ్య తేడా తెలియదు. హైబ్రిడ్ కారు అంటే సంప్రదాయ ఇంజిన్ ఎలక్ట్రిక్ మోటార్ ఇంజిన్ కలయికగా చెప్పవచ్చు. ఇందులో పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఇంజిన్‌కి ఒక ఎలక్ట్రిక్ మోటారు జతచేసి ఉంటుంది. కొన్ని హైబ్రిడ్ కార్లు పూర్తిగా ఎలక్ట్రిక్ మోటార్లపై నడుస్తాయి. కొన్ని ఇంధన ఇంజిన్లతో నడుస్తాయి.




కారులో ఈ రెండూ కలిసి పనిచేస్తాయి. హైబ్రిడ్ కారులో అధిక ఓల్టేజీ బ్యాటరీ ఉంటుంది. ఈ బ్యాటరీ ప్యాక్ ఇంధన వినియోగాన్ని తగ్గిస్తుంది.
మారుతి నుండి 4 హైబ్రిడ్ కార్లు:
మారుతి సుజుకి 2026 చివరి నాటికి కనీసం నాలుగు శక్తివంతమైన హైబ్రిడ్ కార్లను పరిచయం చేస్తుంది. అధికారిక లాంచ్ టైమ్‌లైన్, ఉత్పత్తి వివరాలు ఇంకా ప్రకటించనప్పటికీ, రాబోయే శ్రేణిలో ఫ్రాంక్స్ హైబ్రిడ్, కొత్త తరం బాలెనో, ప్రీమియం సబ్-4 మీటర్ ఉంటాయి.

**మారుతి ఫ్రాంక్స్ హైబ్రిడ్:**
ఇటీవలే టెస్టింగ్‌లో కనిపించిన మారుతి ఫ్రాంక్స్ హైబ్రిడ్.. దాని బలమైన హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌ను కలిగి ఉన్న బ్రాండ్ మొదటి మోడల్ అవుతుంది. ఇది 2026 ప్రథమార్థంలో షోరూమ్‌లలోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ కాంపాక్ట్ క్రాస్‌ఓవర్ (అటానమస్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్) సూట్‌ను కూడా కలిగి ఉంటుందని స్పై ఫోటోలు వెల్లడిస్తున్నాయి.

**బాలెనో, మినీ ఎంపీవీ:**
ఫ్రాంక్స్ హైబ్రిడ్ తరువాత తదుపరి తరం బాలెనో హ్యాచ్‌బ్యాక్, జపనీస్-స్పెక్ సుజుకి స్పేసియా ఆధారంగా ఒక మినీ ఎంపీవీ కూడా త్వరలో ప్రారంభమవుతుంది. రెండు మోడళ్లలో మారుతి సుజుకి కొత్త హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ ఉంటుంది.

**హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్:** మారుతి సుజుకి తన స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్‌లో ఉపయోగించిన 1.2-లీటర్, 3-సిలిండర్ సిరీస్ పెట్రోల్ ఇంజిన్‌ను హైబ్రిడ్‌గా మార్చడానికి సన్నాహాలు చేస్తోంది. మీడియా నివేదికల ప్రకారం, ఈ హైబ్రిడ్ టెక్నాలజీ టయోటా అట్కిసన్ సైకిల్ సిస్టమ్ కంటే పొదుపుగా ఉంటుంది. ఇది 35 కి.మీ/లీ కంటే ఎక్కువ ఇంధన సామర్థ్యంతో సిరీస్ హైబ్రిడ్ సిస్టమ్ అవుతుంది.
ప్రీమియం ఈ ఇండో-జపనీస్ ఆటోమేకర్ 4.5 మీటర్ల కంటే ఎక్కువ పొడవు, మూడు వరుసల సీట్లను కలిగి ఉండే ప్రీమియం %ాఖఌ%పై కూడా పని చేస్తోంది. ఇది గ్రాండ్ విటారా ప్లాట్‌ఫామ్, ఇంజిన్‌లను పంచుకుంటుంది. టాటా సఫారీ, హ్యుందాయ్ అల్కాజార్, మహీంద్రా700, హెక్టర్ ప్లస్ వంటి వాటికి పోటీగా ఉంటుందని భావిస్తున్నారు.

### ఆర్‌బిఐ కీలక నిర్ణయం..
## ఇక బ్యాంకులు 15 రోజుల్లోగా పరిష్కరించాలి

**లేకుంటే కస్టమర్లకు పరిహారం చెల్లించాల్సిందే!**
మరణించిన కస్టమర్ల బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్‌లను 15 రోజుల్లోగా పరిష్కరించాలని, వారి నామినీకి నిధులను పంపిణీ చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం కొత్త నిబంధనలను జారీ చేసింది.బ్యాంక్ ఆలస్యం చేస్తే నామినీకి కూడా పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. మరణించిన కస్టమర్ల క్లెయిమ్‌లను త్వరగా, స్థిరంగా ప్రాసెస్ చేయడానికి ఈ నియమాలు రూపొందించింది. అదనంగా మెరుగైన కస్టమర్ సేవను అందించడానికి డాక్యుమెంటేషన్ ప్రక్రియను సరళీకృతం చేసి ప్రామాణీకరించారు. ఈ నియమాలు మార్చి 31, 2026 నాటికి అమలులోకి వస్తాయని ఆర్బీఐ పేర్కొంది.
**పోస్టల్ వినియోగదారులకు అలర్ట్..** ఇక స్పీడ్ పోస్ట్





డెలివరీలో కీలక మార్పులు

**ఈ నియమాలు ఏ విషయాలకు వర్తిస్తాయి?**
ఈ నియమాలు మరణించిన వ్యక్తి డిపాజిట్ ఖాతాలు, సేఫ్ లాకర్లు, బ్యాంకులో ఉంచిన ఇతర సేఫ్‌లపై క్లెయిమ్‌లకు వర్తిస్తాయి. ఖాతాలో నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ నిబంధన ఉంటే బ్యాంకు నామినీ లేదా సర్వైవర్‌షిప్ నిబంధనను కలిగి ఉంటే బ్యాంకు బకాయి ఉన్న మొత్తాన్ని నామినీ లేదా సర్వైవర్‌కు చెల్లించాలి. అలాగే ఇది బ్యాంకు బాధ్యత నుండి బయటపడిన ట్లుగా పరిగణిస్తారు. క్లెయిమ్ మొత్తం తక్కువగా ఉన్న ట్లయితే అంటే సహకార బ్యాంకులకు రూ. 5 లక్షల వరకు, ఇతర బ్యాంకులకు రూ.15 లక్షల వరకు ఉంటే బ్యాంకు సరళీకృత విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. అయితే మొత్తం ఎక్కువగా ఉంటే బ్యాంకు వారసత్వ ధృవీకరణ పత్రం లేదా చట్టపరమైన పత్రాలను అభ్యర్థించవచ్చు.

**లాకర్లు, సేఫ్‌ల కోసం నియమాలు:**
మరణించిన వ్యక్తి లాకర్ లేదా సేఫ్ పై దావాలకు కూడా నియమాలు ఉన్నాయి. బ్యాంకు అవసరమైన అన్ని పత్రాలను స్వీకరించిన 15 రోజులలోపు దావాను పరిష్కరించాలి. అలాగే హక్కుదారునితో సంప్రదించిన తర్వాత లాకర్‌ను జాబితా చేయడానికి తేదీని షెడ్యూల్ చేయాలి.

**ఆలస్యం అయితే ఏమి జరుగుతుంది?**
డిపాజిట్ ఖాతా క్లెయిమ్‌లు - బ్యాంకు 15 రోజుల్లోపు క్లెయిమ్‌ను పరిష్కరించడంలో విఫలమైతే, ఆలస్యానికి కారణాన్ని వివరించాలి. అలాగే ఆలస్య కాలానికి ప్రస్తుత బ్యాంకు వడ్డీ రేటు ం సంవత్సరానికి 4% చొప్పున సెటిల్‌మెంట్ మొత్తానికి వడ్డీని చెల్లించాలి. లాకర్ క్లెయిమ్‌లు -లాకర్ లేదా సేఫ్‌ను క్లెయిమ్ చేయడంలో ఆలస్యం జరిగితే బ్యాంకు ప్రతి రోజుకు రూ. 5,000 పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నియమాలు కస్టమర్లకు సౌకర్యాలు కల్పించడానికి, మరణించిన వ్యక్తి ఖాతా లేదా లాకర్‌కు సంబంధించిన క్లెయిమ్‌లు త్వరగా, ఖచ్చితంగా ప్రాసెస్ అవుతాయని నిర్ధారించడానికి రూపొందిం చింది ఆర్బీఐ. నామినీలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవడం ద్వారా ప్రక్రియను సులభతరం చేయడం, పారదర్శకంగా చేయడం లక్ష్యం.




# నా నటనకు రిటైర్మెంట్ లేదు

### మాస్ జాతర హీరో రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు. ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.



# రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి

రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్-ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం





# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా (ం÷ఖబరజా। ఐరజీనినిజీ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ (ఖసజీబజీనిబిర ÷ఎజీసపజీ) మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

## మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియారా అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.







## నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

## వశిష్ట మల్లిడిని లైన్‌లో పెట్టిన రవితేజ

టాలీవుడ్ యాక్టర్ రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులు, ఫాలోవర్లను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. భాను బోగవరపు డైరెక్షన్‌లో నటిస్తోన్న మాస్ జాతర నేటినుంచి థియేటర్లలో సందడి చేయనుంది. రవితేజ మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్‌టీ 76 ప్రాజెక్ట్‌ను కూడా లైన్‌లో పెట్టగా.. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రవితేజ ఈ సారి చిరంజీవి డైరెక్టర్‌తో సినిమా చేసే ఎ÷-లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారింది. ఇంతకీ అతడెవరనే కదా మీ డౌటు. బింబిసారతో సూపర్ హిట్ అందుకుని ప్రస్తుతం చిరంజీవితో విశ్వంభర తెరకెక్కిస్తున్న వశిష్ఠ మల్లిడి. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ ఇటీవలే రవితేజకు ఓ ఐడియా చెప్పాడని వార్తలు వస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ క్రేజీ కాంబోలో సినిమా ఒకే అవుతుందా..? అనేది ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా వస్తుందని.. పాపులర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ ఇద్దరి కోసం ఓ కథ రెడీ చేశాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మరి వశిష్ఠ డైరెక్ట్ చేయబోయేది ఈ ప్రాజెక్ట్‌నేనా..? లేదంటే సెపరేట్ సినిమా ఉండబోతుందా..? అనేది తెలియాల్సి ఉంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com